# ప్రజాశక్తి

సోమవారం 15 జనవరి 2024 8 పేజీలు




ప్రకాశం



బాపట్ల

# కోడి పందేలకు సై..

- సంక్రాంతి సంబరాల పేరుతో విచ్చలవిడిగా జూదాలు
- అనధికార వాహనాల స్టాండ్ ఏర్పాటు
- అక్రమ వసూళ్లను చిత్రీకరిస్తుండగా.. ఓ ఛానల్ విలేకరిపై నిర్వాహకుల దాడి
- పట్టించుకోని పోలీసులు



బరిలో కొట్లాడుతున్న పందెం కోళ్లు



దాడి కారణంగా కమిలిన విలేకరి ముఖం

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా.. వేమూరు నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో భారీ స్థాయిలో బరులు ఏర్పాటు చేసి కోడి పందేలు నిర్వహిస్తు న్నారు. భట్టిప్రోలు మండలం, ఓలేరు పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి 216 ప్రక్కన గత రెండేళ్ల క్రితం అక్కడ ఏర్పాటు చేసిన లేఅవుట్లో అనధికారికంగా కోడిపందేల బరి ఏర్పాటు చేశారు. గత ఏడాది భట్టిప్రోలు మండలం, పల్లి కోన గ్రామంలో నిర్వహించిన కోడిపందేల బరిని ఈ ఏడాది ఓలేరు గ్రామానికి తరలించారు. పల్లి కోనలో బరి నిర్వహించిన న్యాయవాది సేరు శ్రీనివాసరావు ఆధ్వర్యం లోనే ఈ ఏడాది కూడా ఓలేరు వద్ద కోడిపందేల బరిని ఏర్పా టు చేశారు. సుమారు పది ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించిన ఈ కోడి పందేల బరిలో వివిధ రకాల ▶ 2లో

## సీనియర్ నేతలకే ధీమా కరువు

- పట్టాలు ఇచ్చి.. ఒంగోలులోనే పోటీకి బాలినేని యోచన
- ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించిన ఎంపీ మాగుంట
- టిక్కెట్లపై స్పష్టత లేక మరికొందరు సీనియర్ల తర్జనభర్జన



**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

వైసిపిలో ఉన్న సీనియర్ నేతల రాజకీయభవితవ్యం ఇలా అవుతుం దని ఎవరూ ఊహించలేదని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో ఉన్నారనే విష యం కన్నా ఒకనాడు జిల్లా రాజకీ యాల్లో చక్రం తిప్పిన బడా నేతలకే ఇప్పుడు కనీసం టిక్కెట్లు దొరుకు తుందా? లేదా? అనే సంశయం కలుగుతోంది. వైసిపి ఆవిర్భావం నుంచి ఉన్న కొందరు నేతలతో పాటు తెలుగుదేశం నుంచి వచ్చిన సీనియర్ దిగ్గజాల భవితవ్యం ఇలాగే ఉంది. ఎన్నికలు సమీ పిస్తున్న తరుణంలో ఇలాంటి విపత్కర పరిస్థితులను అధిష్టానం నుంచి ఎదుర్కో వాల్సి వస్తుందని ఈ సీని యర్లు ఊహించలేదు. తాము చెప్పిందే శాసనంగా జరుగుతుందని అంచనాల్లో ఉన్న నేతల తలరాతలే మారిపోయాయి. కారణం ఎన్నికల వ్యూహకర్తల నివేదికల్లో ఈ నేతలకు ప్రజల్లో ఆదరణ లేదని తేలిపోవడమే.. ఓటర్ల అంచనాల్లో వెనుకబడి ఉండ టమే. తిరిగి టిక్కెట్లు ఇస్తే ▶ 2లో

## ఘనంగా తెప్పోత్సవం



చీమకుర్తి మండలంలోని కె.అగ్ర హారంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు.

**- ప్రజాశక్తి, చీమకుర్తి**

## బెదిరించటం దుర్మార్గం



ఒంగోలులో జీవో ప్రతులను భోగిమంటల్లో వేస్తున్న అంగన్‌వాడీలు

- భోగి మంటల్లో 'ఎస్మా' జీవోలు
- అంగన్‌వాడీల నిరసన
- కొనసాగుతున్న సమ్మె

## కోడి పందేలకు సై..

(మొదటిపేజీ తరువాయి)

జూదాలు ఏర్పాటయ్యాయి. ఈ బరిలో రూ.500 నుండి రూ.2 లక్షల వరకు కోడిపందేల నిర్వహణ కొనసాగుతోంది. ఈ బరులకు ఒకటి నుండి ఐదు నెంబర్లు కేటాయించి వివిధ దశలలో ఏర్పాటు చేశారు. ఒకటో నెంబర్ బరిలో లక్ష రూపాయల నుండి ఆ పైన పందేలు నిర్వహిస్తుండగా రెండో నెంబర్ బరిలో రూ.50 వేల నుండి లక్ష రూపాయల వరకు మరియు మూడో నెంబర్ బరిలో 20 వేల నుండి 50 వేల వరకు మరియు నాలుగో నెంబర్ బరిలో రూ.5 వేల నుండి 20వేల వరకు పందేలు కొనసాగుతున్నాయి.

**ఓలేరులో రాత్రికి రాత్రే..**

శనివారం సాయంత్రం వరకు బరి ఎక్కడ ఏర్పాటుచేయాలి అనేది సందిగ్ధంలో ఉండగా.. రాత్రికి రాత్రి యుద్ధప్రాతిపదికన ఓలేరు వద్ద కోడి పందేల బరులను సిద్ధం చేశారు. గత ఏడాది పల్లెకోనలో నిర్వహించిన బరిలో ఉన్న మెస్సులు, సిమెంట్ స్తంభాలు ఇతర సామాగ్రి అందుబాటులో ఉండటంతో ఏడాది ఓలేరుకు తరలించి రాత్రికి రాత్రి ఈ బరులను సిద్ధం చేసినట్లు తెలిసింది. సంక్రాంతి సంబరాల పేరిట ఆదివారం నుండి మంగళవారం వరకు కోడిపందేలు నిర్వహణ కొనసాగుతుందని బరిలో బహిరంగంగా మైక్ ద్వారా నిర్వాహకులు తెలియజేస్తున్నారు. ఈ పందేలను వీక్షించేందుకు ప్రత్యేకంగా స్టేజిని ఏర్పాటు చేసి.. విఐపి గ్యాలరీని కూడా సిద్ధం చేశారు. సోమవారం నుండి ఈ పందేలు వీక్షించటానికి అధికార పార్టీకి చెందిన పలువురు వీఐపీలు, మంత్రులు పాల్గొంటారని నిర్వాహకు లలో ఒకరు తెలిపారు. పందేల నిర్వహణదారుడైన సేరు శ్రీనివాసరావు అటు వేమూరు ఇటు రేపల్లె నియోజకవర్గ పరిధిలోని మంత్రి నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణరావుకు సన్నిహితుడిగా ఉన్నారు. వీరిరువురి కనుసన్నల్లోనే పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ కోడిపందేల బరి జాతీయ రహదారి ప్రక్కన ఉండటంతో బాపట్ల, గుంటూరు, కష్ణాజిల్లాల నుండి అధిక సంఖ్యలో జూదరులు కార్లు, ద్విచక్ర వాహనాలపై వస్తున్నారు.

**విలేకరిపై దాడి..**

**వేమూరు:** వేమూరి నియోజకవర్గంలో కొల్లూరు మండలం పెసరలంకలో కోడిపందేల బరి అనధికారికంగా వాహనాల స్టాండ్ ఏర్పాటుచేసి.. వసూళ్లు చేస్తున్నారు. దీనిని చిత్రీకరిస్తున్న ఓ టీవీ ఛానల్ రిపోర్టర్‌పై నిర్వాహకులు దాడి చేశారు. ఈ దాడిలో విలేకరికి తీవ్రగాయాలయ్యాయి. దాడిని గుంటూరు, బాపట్ల జిల్లాల జర్నలిస్టు ఫోరం తీవ్రంగా ఖండించింది. విలేకరిపై దాడిని ఖండిస్తూ.. కొల్లూరు ప్రధాన సెంటర్లో తెలుగుదేశం, జనసేన పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ధర్నా కార్యక్రమంలో టిడిపి నాయకులు మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూధన ప్రసాద్, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

## టిడిపిలో 15 కుటుంబాలు చేరిక

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి నియోజకవర్గ సీనియర్ టిడిపి నాయకులు ముచుమారి చెంచిరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సమక్షంలో ఆదివారం స్థానిక అమరావతి గ్రౌండ్లో కనిగిరి మండలం బోటికర్లపాడు ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. కామునురి శ్రీకష్ణ, కామునురీ చిననరసింహులు, దాసరి లక్ష్మీనారాయణ, దాసరి చిన్నారాయణ, లేగల నాగార్జున, లేగల నాగ భూషణం, లెగల చెన్నయ్య, కామునూరి చలపతి, అంబటి తియోప్లస్, లెగాల నరేంద్ర, అంబటి దేవదానం, కామునురి భాను, కామునురి శ్రీహరి, కామునురీ వెంకటనరసయ్య, లేగల బాలసుబ్బయ్యలు పార్టీలో చేరగా డాక్టర్ ఉగ్ర పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సైకో జగన్ వైసీపీ పాలన పట్ల విశ్వాసం కోల్పోయి చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో రాష్ట్ర అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్నారన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ శ్రేణులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తప్పక తగిన ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డిని ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర ప్రత్యేకంగా అభినందించారు.

# కనుమళ్లలో బిఆర్ అంబేద్కర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

శింగరాయకొండ మండలం కనుమల్ల గ్రామంలో ఆదివారం రాత్రి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ కె మన్మథరావు ఆవిష్కరించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని కనుమల్ల గ్రామంలోని కందుకూరు-శింగరాయకొండ రోడ్డుకు పక్కన ఏర్పాటు చేసిన ఈ విగ్రహాన్ని న్యాయమూర్తి డాక్టర్ కే మన్మథరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్డిఓ మన్నం సుగుణమ్మ, ప్రొఫెసర్ సత్యపాల్, ప్రొఫెసర్ చింతకాయల ప్రజ్ఞ, ప్రొఫెసర్ కసుకుర్తి వెంకటరావు తదితరులు హాజరయ్యి ప్రసంగించారు.



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి మన్మథరావు

# ముగ్గుల పోటీలకు విశేష స్పందన

**ప్రజాశక్తి-దర్శి**

సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళల కోసం ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన రావడం అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసీపీ ఇన్‌ఛార్జీ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బూచేపల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో 250 మంది పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా వారు బహుమతులను అందించారు. పావని జానకి మొదటి బహుమతి ఏసీని గెలుచుకుంది. రెండో బహుమతి ప్రత్యూష వాషింగ్ మిషన్‌ను, మూడో బహుమతి ఆవుల నాగఅనిత ఫ్రిజ్, నాలుగో బహుమతి అనూష ఎల్‌ఈడీ టీవీని గెలుచుకుంది. న్యాయ నిర్ణేతలుగా ఎంఈఓ రమాదేవి, డాక్టర్ ఝాన్సీ వ్యవహరించారు. అదే విధంగా సోమవారం ట్రాక్టర్ రివర్స్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రామ్‌భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దేవదానం, మాజీ ఏఎంసీ చైర్మన్ కేవీ రెడ్డి, సిద్ధి పుల్లారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




బహుమతులు అందజేస్తున్న బూచేపల్లి

**జబర్దస్త్ టీమ్‌కు అభినందనలు**

కళాంజలి ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో శనివారం రాత్రి జరిగిన జబర్దస్త్ వారు చేసిన కార్యక్రమాలు అందరినీ ఆకర్షించాయి. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి పాల్గొని జబర్దస్త్ టీమ్‌కు అభినందనలు తెలిపారు. అదే విధంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాంజలి ఈవెంట్స్ వారితో పాటు పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# సీనియర్ నేతలకే ధీమా కరువు

(మొదటిపేజీ తరువాయి)

ఎంత మెజార్టీతో ఓడిపోతారనే నివేదికలూ అధిష్టానం వద్ద ఉంచారు. వీటిని చూపించి మీ జాతకం ఇదీ.? అంటూ అధిష్టానం పెద్దలు చర్చలు పెడుతున్నారు. కొందరిని తప్పించారు. ఇక మీసేవలు చాలంటూ ఇంటికి పంపుతున్నారు. ఆర్థిక స్తోమత ఉన్న మరి కొందరు నేతలకు స్థానాలను మార్చారు. ఈ జాబితాలో ఇద్దరు మంత్రులు ఉండటం గమనార్హం. జిల్లాలో సీనియర్ నేతల భవితవ్యమే ఇప్పుడు అయోమయంలో పడింది. మాజీ మంత్రులు బాలినేని, శిద్దాతో పాటు ఎంపీ మాగుంట, మరో సీనియర్ ఎమ్మెల్యే కరణం బలరాం, మానుగుంట మహిధర్‌రెడ్డి ఇలా చెప్పుకుంటే పోతే ఉమ్మడి ప్రకాశమంతా నేతలు కనిపిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు సిట్టింగులు ఎగిరిపోయారు. ఒక ఇన్‌ఛార్జిని తప్పించారు. ఇద్దరు మంత్రులను స్థానభ్రంశం చేసిన సంగతి తెలిసిందే. మిగిలిన స్థానాలపై తర్జనభర్జనలు నడుస్తున్నాయి. ఎడతెగని పంచాయతీలు సాగుతున్నాయి. అయినా అంచనాలకు రాలేకపోతున్నారు. ఎంపీ మాగుంటకు తేల్చిచెప్పేశారు. టిక్కెట్టు లేదని చెప్పడంతో ఆయన ప్రత్యామ్నాయాలు చూసుకుంటున్నారు. తిరిగి తెలుగుదేశంలోకి వెళ్లడం అనివార్యమంటున్నారు. అదేదో అధిష్టానం కాదన్నాకే వెళ్లవచ్చని వేచిచూస్తున్నారు. అప్పటివరకూ మౌనంగా ఉంటే మంచిదనే భావనలో ఉన్నారు. మాజీ మంత్రి బాలినేని కూడా మాగుంట కోసం చివరిప్రయత్నాలు చేశారు. ఆయన ప్రయత్నాలు ఫలించకే తిరిగి హైదరాబాదు వెళ్లారు. ఇక ఆయన భవితవ్యంపైనా ఈ పరిణామాలన్నీ పడ్డాయి. చివరికి ఆయన గిద్దలూరు అనే పరిస్థితికి వచ్చాయి. మాగుంటకు టిక్కెట్టు ఇప్పించలేక.. ఒంగోలులో పేదలకు పట్టాలు ఇవ్వలేకపోతే ప్రతిష్ట పోతుందనే భావనలో బాలినేని తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటివరకూ ఆయన ఎక్కడ పోటీచేస్తారనే దానిపై స్పష్టత లేదు. సిఎం జగన్ ఆయనకు గిద్దలూరు సూచించారు. అయితే పట్టాలు ఇచ్చి ఒంగోలులోనే పోటీ చేయాలనే యోచనలోనే బాలినేని ఇప్పటికీ ఉన్నారు. పట్టాలకు నిధులు ఇస్తారా? లేదా? అనే దానిపై ఇప్పుడు ఆయన పోటీ ఎక్కడనేది ఆధారపడి ఉంది. మరో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు రాజకీయ భవితవ్యం కూడా ఇప్పుడు అయోమయంగానే ఉంది. అధిష్టానం ఒంగోలు, మార్కాపురం స్థానాలు సూచించగా ఆయన తిరస్కరించారు. దర్శిపైనే పట్టుబట్టి ఇపుడు ఎక్కడా సీటు లేకుండా చేసుకున్నారు. ఎన్నికల్లో శిద్దా నిజంగా దర్శి నుంచే పోటీ చేయాలంటే ఇప్పుడున్న పార్టీలో సాధ్యం కాదు. ఈ స్థానం బూచేపల్లికి ప్రకటించారు. పార్టీ మారితే తప్ప దర్శిలో శిద్దాకు అవకాశం లేదన్నది చెప్పాల్సిన అవసరం లేదు. మరో సీనియర్ నేత కరణం బలరాం రాజకీయ భవితవ్యం కూడా ఇదే కోవలోఉంది. ఆయన కుమారుడు మోకాలు చికిత్స అనంతరం విశ్రాంతిలో ఉన్నారు. చీరాల్లోనే తిరిగి పోటీ చేయాలనే పట్టుదలతోనే ఉన్నారు. అయితే అధిష్టానం గతంలోనే వెంకటేశ్‌ను ఇన్‌ఛార్జిగా నియమించింది. తాజాగా మళ్లీ సీటుపై నివేదికల ప్రభావం కనిపిస్తోంది. ఇక్కడా మార్పులుంటాయనే ప్రచారం ఉంది. జిల్లాలో ఎంతో రాజకీయ పరిణితి ఉన్న కరణం బలరాం వైసిపిలో చేరాక ఇప్పుడు విపత్కర పరిస్థితిని ఎదుర్కోవాల్సి వచ్చిందనే చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. కందుకూరులోనూ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మానుగుంటకూ టిక్కెట్టుపై పలురకాల ప్రచారాలు ముందుకు వచ్చాయి. ఇక్కడ బీసీల కోటాలో బొట్ల రామారావును అధిష్టానం పిలిచి మాట్లాడింది. ఈయన పేరు పరిశీలనలో ఉంది. అయితే ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా సహకరిస్తామని ఎమ్మెల్యే మానుగుంట ప్రకటించడం విశేషం.

ఇంకా మరో సీనియర్ నేత, పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డికి టిక్కెట్టు ఖరారైనా ఆఖరు నిమిషంలో మూడో జాబితాలో నిలిపేశారు. ఆయనకు ప్రకటించేదాకా ధీమా కనిపించడం లేదు. గిద్దలూరు నుంచి రెండుసార్లు గెలిచిన అన్నా రాంబాబు రాజకీయాలకు దండం పెట్టేశారు. జిల్లాలో రాజకీయ దిగ్గజాల భవితవ్యం ఒక్కసారిగా తారుమారైంది. ఇందుకు ఎన్నికల వ్యూహకర్తల నివేదికలే కారణం. వ్యతిరేకత పేరుతో నేతలను పక్కనబెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. పాలకపక్షంలో చోటుచేసుకున్న ఈ పరిణామాలు ఆ పార్టీ సీనియర్లనే విస్తుపోయేలా చేశాయి.



జీవో ప్రతులు దహనం చేస్తున్న ఉగ్ర

## భోగి మంటల్లో జీవో ప్రతులు దహనం

**ప్రజాశక్తి-కనిగిరి**

సైకో జగన్ పాలన పోవాలని, చంద్రన్న సారథ్యంలో సైకిల్ పాలన రావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని కనిగిరి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలియజేశారు. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని అమరావతి గ్రౌండ్లో వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాల జీవో ప్రతులను, చంద్రబాబు నాయుడు, లోకేష్‌లపై అక్రమంగా పెట్టిన కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను ఆయన టిడిపి శ్రేణులతో కలిసి భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా టిడిపి శ్రేణులకు, నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిలకపాటి లక్ష్మయ్య, ఆర్‌వి నారాయణ, శ్రీను, కరణం అరుణ, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## దర్శికి చేరిన సాగర్ నీరు

**ప్రజాశక్తి-దర్శి**

తాగునీటి కోసం నాగార్జున సాగర్ కెనాల్ నుంచి వదిలిన నీరు ఆదివారం దర్శికి చేరాయి. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ తాగునీటి కోసమే సాగర్ జలాలు వదిలారని, వ్యవసాయానికి లేవని అన్నారు. మొత్తం సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, నోటిఫైడ్ ట్యాంకులు నింపుతామన్నారు. ఓబీసీ వద్ద 600 క్యూసెక్కులు వచ్చాయన్నారు. జిల్లాకు 85/3 వద్ద 2224 క్యూసెక్కులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా సాగర్ నీటి కోసం పంపింగ్ చేస్తున్నారు.

# ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



కనిగిరిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

**ప్రజాశక్తి-కనిగిరి**

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని శివనగర్ కాలనీ, మంగలి మాన్యంలో డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రంగవల్లులు, కుర్చీలాట, తాడు లాగుట పోటీలను నిర్వహించారు. మహిళలు, యువతులు అధిక సంఖ్యలో పాల్గొని రకరకాల రంగవల్లులను తీర్చిదిద్దారు. ప్రతిభను కనబరిచిన వారికి బహుమతులను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పీసీ కేశవ రావు ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, ఐద్వా నాయకులు ఎస్కే బషీరా, శాంతకుమారి, ప్రసన్న, సిఐటియు నాయకులు యు పిచ్చయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు

**మద్దిపాడు:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మండల కేంద్రమైన మద్దిపాడులోని బీసీ కాలనీలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళ ముగ్గులు వేసేందుకు పోటీపడ్డారు. కాలనీలో పండుగ వాతావరణం ఏర్పడటంతో చిన్నారులు ఆ ముగ్గులను తిలకిస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ పోటీలకు ఉబ్బ ఆదిలక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

**కొండపి:** ఆటల పోటీలు యువజన మైత్రికి బాటలు అనే నినాదంతో వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, మహిళా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన కొండపిలోని నూతన సచివాలయం ఆవరణలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కెజి మస్తాన్ తెలిపారు. స్త్రీలకు ముగ్గుల పోటీలు, పాటల పోటీ, మ్యూజికల్ చైర్సు, ఉండమ్మా బొట్టు పెడతా, బక్కెట్‌లో బంతి వేయుట, పురుషులకు బైక్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి శ్రీ ప్రసన్నాంజనేయ దేవాలయ ట్రస్టు వారి చేత మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.



సంతనూతలపాడులో పోటీలను ప్రారంభిస్తున్న నేతలు

**సంతనూతలపాడు:** సంక్రాంతి పర్వదినం సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటల పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి . ఐద్వా డివైఎఫ్ఐ జేవివి సిఐటియు వ్యవసాయకార్మిక సంఘం తదితర సంఘాల ఆధ్వర్యంలో ఈ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి నాయకురాళ్లు ఎస్కే నాగూర్బీ కే బుజ్జి జెవివీ జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు సిఐటియు నాయకులు ఎం సుబ్రహ్మణ్యం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసుల వెంకటేశ్వర్లు డి వై ఎఫ్ ఐ నాయకులు ఆర్ జార్జి కే శ్యాం జి అంజి ఎన్ రాజేష్ ఎన్ కార్తీక్ సిహెచ్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న విజయ్‌కుమార్

## టిడిపి ఆధ్వర్యంలో ఆటల పోటీలు

**ప్రజాశక్తి-చీమకుర్తి**

టిడిపి ఆధ్వర్యంలో చంద్రన్న సంక్రాంతి కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు, నియోజకవర్గ స్థాయి ముగ్గుల పోటీలు భారీ స్థాయిలో జరిగాయి. ఆదివారం స్థానిక హరిహర క్షేత్రం సమీపంలోని ఎమ్మెన్నార్ అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీలను, ముగ్గుల పోటీలను సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ లాంఛనంగా ప్రారంభించారు. ముగ్గుల పోటీలో వందమంది మహిళలు పాల్గొన్నారు. కబడ్డీ పోటీలలో నెల్లూరు, చీరాల, ఇంకొల్లు, గొట్లగట్టు ప్రాంతాల నుంచి ఆరు టీములు తలపడ్డాయి. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండో బహుమతి 50 వేల రూపాయలు, మూడో బహుమతి 25 వేల రూపాయలు అందజేస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతి అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు డిఎస్పి వేణు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్ర భాస్కరరావు, టిడిపి నాయకులు మన్నమ్ ప్రసాదు, జి రాఘవరావు వేల్పుల శీను గొల్లపూడి సుబ్బారావు, కందిమల్ల గంగాధర్‌రావు, ఎడ్లపల్లి రాంబ్రహ్మం, మన్నం నాగరాజు, అడక స్వాములు, కాట్రగడ్డ రమణయ్య, ఉన్నం సుబ్బారావు, సూరంపల్లి హనుమంతరావు, పూనాటి వెంకట్రావు, గొల్లపూడి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## యాదవ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాశక్తి-గిద్దలూరు**

గిద్దలూరు నియోజకవర్గ యాదవ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పట్టణంలోని డాక్టర్ బివి రంగారావు ఫంక్షన్ హాల్లో డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో జ్యోతి ప్రజ్వలన మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య యాదవ్ చేయగా, యాదవ నూతన క్యాలెండర్ ను నియోజకవర్గ గౌరవాధ్యక్షులు డాక్టర్ బివి రంగారావు యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షులు చల్లా రవికాంత్ యాదవ్ మాట్లాడుతూ యాదవ్ ఉద్యోగులు ఐక్యమత్యంతో ఉండి పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్ యాదవ్, రాచర్ల మండల గౌరవాధ్యక్షులు కటారు బాల గురవయ్య యాదవ్, కొమరోలు మండల సెక్రటరీ బొర్రా.రాజశేఖర్ యాదవ్, బెస్తవారిపేట మండల అధ్యక్షులు చిన్నయ్య యాదవ్, సెక్రెటరీ నాగేశ్వరరావు యాదవ్, కంభం మండల అధ్యక్షులు మొర్రి వెంకట కష్ణ యాదవ్ పాల్గొన్నారు.

## తాగునీటి కష్టాలు తీర్చేందుకే వాటర్‌ప్లాంట్

### సిఐ వై.పాండురంగారావు

**ప్రజాశక్తి-కొండపి**

ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తాగునీటి కష్టాలు తీర్చాడానికి ఉచిత వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు కొండపి సిఐ వై పాండురంగారావు తెలిపారు. ఆదివారం కొండపిలోని పొదిలి రోడ్డులో గుడిపల్లి చందు కళ్యాణ మండపం వద్ద తన కుమారుడు జ్ఞాపకార్థం గుడిపల్లి రమణయ్య ఉచిత వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను సిఐ పాండురంగారావు ప్రారంభించి మాట్లాడుతూ పుట్టిన గ్రామంలో సంక్రాంతి సంబరాలకు రమణయ్య వచ్చి.. అక్కడ బస్తీవారు తాగటానికి గుక్కెడు నీళ్లు లేక పడుతున్న కష్టాలను చూసి చలించిపోయారు. గుడిపల్లి రమణయ్య బస్తీవారి ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని రూ.5 లక్షలు వెచ్చించి మినరల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వెంటనే భోగి పండుగ సందర్భంగా ప్రారంభించి బస్తీవారికి కానుకగా ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ దంపతులు, గుడిపల్లి రమణయ్య దంపతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సిఐ పాండురంగారావు

## ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

మండలంలోని ఉప్పుగుండూరులో మాదాసు కృష్ణమూర్తి మెమోరియల్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. అప్పటివరకు జరిగిన పోటీల్లో కండ్లగుంట, కనపర్తి మధ్య జరిగిన పోటీల్లో కండ్లగుంట జట్టు విజయం సాధించింది. ఉప్పుగుండూరు ఇమ్మానియల్ ఫ్రెండ్స్ మధ్య జరిగిన పోటీలో ఉప్పుగుండూరు జట్టు విజయం సాధించింది. ఫ్రెండ్స్ యూత్, కండ్లగుంట-2 మధ్య జరిగిన పోటీలో కండ్లగుంట-2 జట్టు విజయం సాధించింది. శ్రీరామ్ కనపర్తి, కండ్లగుంట మధ్య జరిగిన పోటీలో శ్రీరామ్ కనపర్తి జట్టు విజయం సాధించాయి. ఉప్పుగుండూరు ఏకలవ్య, శ్రీరామయూత్ కనపర్తి మధ్య జరిగిన మ్యాచ్‌లో శ్రీరామ్ యూత్ విజయం సాధించారు. నాగులుప్పలపాడు ప్రవీణ్ టీమ్ బెస్ట్ ఫ్రెండ్స్ కండ్లగుంట మ్ణధ జరిగిన పోటీలో నాగులుప్పలపాడు ప్రవీణ్ జట్టు విజయం సాధించింది. ఉప్పుగుండూరు హైస్కూల్, మాదాసు మెమోరియల్ టీముల మధ్య జరిగిన పోటీల్లో మాదాసు మెమోరియల్ టీము విజయం సాధించింది. ఈ పోటీలకు ఎంపైర్లుగా జీ ఎలీష, పి రమణ వ్యవహరించారు. నిర్వాహకులు మాదాసు రాంబాబు, పెంట్యాల శ్రీనివాసరావు, ప్రవీణ్ పర్యవేక్షించారు.

## జనసేన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్**

రాచర్ల మండలం, అనుములపల్లే గ్రామం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు కోళ్ల రంగశాయి అధ్వర్యంలో రాచర్ల మండల జనసేన కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమం లో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేనపార్టీ కార్యక్రమాల గురించి జనసేన నాయకులు కార్యకర్తలు పార్టీ ప్రణాలికలుతో కూడిన చర్చలు జరిపారు.ఈ సందర్భంగా జనసేన మండల అధ్యక్షులు పుట్టా బాలకష్ణ మాట్లాడుతూ జనసేన పార్టీ గుర్తు గాజు గ్లాసు ను ప్రజలోకి తీసుకెళ్లి పార్టీ మ్యానిఫెస్టో అంశాలను ప్రజలకు వివరిస్తూ జనసేన పార్టీని ప్రజల్లోకి తీసుకుపోవాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుమ్మ వెంకటసుబ్బమ్మ , మాజీ సర్పంచ్, పార్లపల్లి శ్రీనివాసులు, బి సాయన్న, కటిక సురేష్, ఆసుల రమేష్, ఎన్ రాజు, యామ రామకష్ణ, పసుపులేటి గోపాలు, వీరిశెట్టి బాలకష్ణ, బత్తిని కష్ణయ్య, ఉల్లి ప్రభాకర్ నాయుడు జనసేననాయకులు, కార్యకర్తలు, జన సైనికులు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో

## గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని మృతి

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**



మృతిచెందిన సుబ్బరాయుడు

గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని వలపర్ల గ్రామానికి చెందిన వెచ్చా సుబ్బరాయుడు(60) వ్యాపార రీత్యా మార్టూరులో నివాసం ఉంటూ నాగరాజుపల్లి సమీపంలో లక్ష్మీ సాయి గ్రానైట్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. ఇటీవలే కొణిదెన రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ నుంచి చౌదరి కాలనీకి నివాసం మార్చాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గుడికి వెళ్లి వద్దాం రెడీగా ఉండు అని భార్యకి చెప్పి పూలు కోసుకొస్తానని ఇంటి పైకి వెళ్లిన సుబ్బరాయుడు ఎంత సేపటికి కిందికి రాకపోవడంతో ఇంటిపైకి వెళ్లిన భార్య అక్కడ రక్తపు మడుగులో బోర్లపడి ఉన్న భర్తను చూసి ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యింది. కేకలు పెడుతూ స్థానికులను అప్రమత్తం చేసింది. పరిశీలించిన స్థానికులు అప్పటికే మృతి చెందినట్లుగా గుర్తించారు. పండగ సందర్భంగా గుడికి వెళ్లి పూజలు చేయించుకుందామని ఇంటిపైన పూలు తేవడానికి వెళ్లిన సుబ్బారాయుడు శవమై కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు పెద్ద ఎత్తున ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలు అమెరికాలో నివాసం ఉంటున్నారు. ఉదయాన్నే మంచు ఎక్కువగా ఉన్న సమయంలో డాబాపై ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతి చెందాడా? మరేదైనా కారణాలు ఉన్నాయా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.




## ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

**ప్రజాశక్తి-మార్టూరు రూరల్**

ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్టూరు సమీపంలోని గొట్టిపాటి హనుమంత రావు కాలనీలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా కంభంకు చెందిన ఉరిశెట్టి రవికుమార్ గత కొంతకాలంగా మార్టూరు ప్రాంతంలో పెయింట్ పనులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానికంగా ఉన్న ఒక మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకొని గొట్టిపాటి హనుమంతరావు కాలనీలో ఉంటున్నాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఆ మహిళతో గొడవ పెట్టుకుని ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని చీరతో ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు తలుపులు బద్దలుకొట్టి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. జరిగిన ఘటనపై సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి ఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### మానసిక ఉల్లాసానికి

## క్రీడలు దోహదం: ఉడుముల

**ప్రజాశక్తి-కొనకనమిట్ల**

కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు గ్రామ పంచాయతీలో సంక్రాంతి పండుగ సందర్భంగా కబడ్డీ పోటీలను కంభం మాజీ శాసనసభ్యులు ఉడుముల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సురవరపు పెద్దవెంకటరెడ్డి, చిన్నారికట్ల సొసైటీ అధ్యక్షులు ఉడుముల కాశిరెడ్డి, గొట్లగట్టు ఉపసర్పంచ్ గాడి కోనేటిరెడ్డి, సీసీ కేర్ శ్రీనివాసరెడ్డి, ఏలూరి సంజీవరెడ్డి, గోనుగుంట్ల శ్రీనివాసులు, ఉప్పుటూరి వెంకటయ్య, సాక్షి వెంకటేశ్వర్లు, గ్రామ కన్వీనర్లు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# భోగి మంటల్లో ఎస్మా ప్రతులు..



బాపట్లలో ఎస్మా జిఓ ప్రతులు దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు



రేపల్లెలో సమ్మె శిభిరం వద్ద భోగిమంటల్లో జిఓ దగ్ధం

**ప్రజాశక్తి - బాపట్ల**

చిన్నారులు కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాలు చేసుకోవాల్సిన అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెతో రోడ్డెక్కారు. సమ్మె శిబిరంలోనే భోగిమంటలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 34 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా పాదయాత్రలో ఇచ్చిన హామీలు అధికారానికి వచ్చాక గాలికి వదిలేశారని అంగన్‌వాడీలు ఆరోపించారు. దీంతో సమ్మెబాట పట్టి నెల రోజులు దాటుతున్న పట్టించుకున్న నాథుడు లేడని అన్నారు. అంగన్‌వాడీల సమ్మెపై ప్రభుత్వం మొండిగా, మోసపూరితంగా వ్యవహరిస్తుందని అన్నారు. జగనన్నకు చెబుదామని కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. పండగపూట సైతం పస్తులతో గడిపే పరిస్థితి ఉప్పడిందని అన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల సానుకూలతతో ఎంతో కొంత వేతనాన్ని పెంచి సమ్మెను విరమింప జేయాలని ప్రజలు కోరుతున్నారు.

**కారంచేడు :** అంగన్‌వాడి కార్యకర్తలు భోగి పండుగ సందర్భంగా ఎస్మా చట్టం జీఓ కాపీలను భోగిమంటల్లో ఆదివారం దగ్ధం చేశారు. తహశీల్దారు కార్యాలయం ఆవరణలో ముగ్గుల రూపంలో నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య మాట్లాడారు. అంగన్‌వాడి నాయకులు అనిత, శ్రీలక్ష్మి, క్రీస్తు రాజ్యం, కళ్యాణి, హఫీజ, శివ లీల, ఆదిలక్ష్మి, రాధా పాల్గొన్నారు.

**అద్దంకి :** అంగన్‌వాడి కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద భోగి పండుగ సందర్భంగా జీఓ నెంబర్2 కాపీలు దగ్దం చేశారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు పి తిరుపతిరెడ్డి, సిఐటియు నాయకులు జి శారద, కళావతి పాల్గొన్నారు.

**రేపల్లె :** సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు భోగిమంటలు వేసి ఎస్మా చట్టం కాపీలు దగ్ధం చేసి నిరసన తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సి, సిఐటియు జిల్లా అధ్యక్షులు మణిలాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీ మహిళలను పండుగ రోజు కూడా రోడ్డున పడ్డున పడేలా చేయడం సిగ్గుచేటని అన్నారు. అంగన్‌వాడీ యూనియన్ సిఐటియు నాయకులు జయప్రద, డి జ్యోతి, నాగమణి, ప్రజ సంఘాలు నాయకులు కె రమేష్, కె ఆశీర్వాదం పాల్గొన్నారు.

**నిజాంపట్నం :** భోగి పండుగ సందర్భంగా అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్ద భోగిమంటలు వేసి ఎస్మా చట్టం కాపీలను ఆదివారం దగ్ధంచేశారు. అంగన్‌వాడిలపై ఎస్మా చట్టం, షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని కోరారు. జగనన్నకి చెబుదామని ప్రజలవద్ద నుంచి సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, గాయత్రి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

**వేమూరు :** అంగన్‌వాడీల వేతనాలు పెంపుకై చేపట్టిన నిరవధిక దీక్షలో భాగంగా ఆదివారం సంక్రాంతి పండుగను లెక్కచేయకుండా ప్రధాన రహదారిపై నిరసన చేపట్టారు. అంగన్‌వాడీల సమస్యలకు పరిష్కారం దొరకాలని హరిదాసుడు ప్రార్థించాడు. సిఐటియు కార్యదర్శి బి ఆగస్టిన్ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు.

**భట్టిప్రోలు :** తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల నిరాహార దీక్షలో ఎదుట ఎస్మా జీఓ కాఫీలను ఆదివారం భోగి మంటల్లో దగ్ధం చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను భయపెట్టే చర్యలు మానుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి సుధాకర్, నాగరాజు, సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రమాదేవి, గృహలక్ష్మి, సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

**చీరాల :** స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా సంక్రాంతి భోగి మంటల్లో ఎస్మా కాపీలను దగ్దం చేశారు. సమస్య పరిష్కరించకపోతే సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్యాలెస్ ముట్టడిస్తామని చెప్పారు. అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి రేఖ, సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు, జి సుజీవన, సులోచన, అరుణ, రాధిక పాల్గొన్నారు.

**కొల్లూరు :** అంగన్‌వాడీ కార్యకర్తలు భోగి మంటలు వేసి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి సుబ్బారావు, అంగన్‌వాడీ లీడర్స్ సౌభాగ్య, లక్ష్మి, భాగ్యం, ఆదిలక్ష్మి, నాగరాజకుమారి పాల్గొన్నారు.

**చెరుకుపల్లి :** అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన ఎస్మా ప్రతులను భోగి మంటల్లో దహనం చేశారు. పండుగ రోజు కూడా తాము నిరసనలు తెలిపే విధంగా చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

**మార్టూరు రూరల్ :** అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లు పరిష్కరించడంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడి సంక్రాతి కానుకగా జీతాలు పెంచి సమ్మెకు ముగింపు పలికేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల హనుమంతరావు, ఎనికపాటి రాంబాబు, మార్టూరు సెక్టార్ యూనియన్ నాయకులు తాళ్లూరి రాణి, శ్యామల, శాంతి, రాజేశ్వరి, నాగ పుష్ప రాణి, కుసుమ అంకమ్మ పాల్గొన్నారు.




మార్టూరులో దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న మజుందార్



చీరాల తహశీల్దారు కార్యాలయం వద్ద జిఒలు దగ్ధం



ఆనందతో భోగి మంటలు వేస్తున్న మహిళలు

## ఘనంగా భోగి వేడుకలు

**ప్రజాశక్తి - చీరాల**

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలో భోగి మంటలు వేశారు. వేకువ జాము నుండి పలు ప్రాంతాల్లో యువత, మహిళలు భోగి మంటలు వేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పట్టణంలోని శ్రీ వైష్ణవి ఎవెన్యూ కమ్యూనిటి ప్రసిడెంట్ సూరగాని లక్ష్మి ఆధ్వర్యంలో అపార్ట్మెంట్లోని మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ముంతావారి సెంటర్, పేరాల, నల్ల గాంధీ బొమ్మ సెంటర్, గొల్లపాలెం ప్రాంతాల్లో యువత భోగి మంటలు వేస్తు పండుగను జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల వద్ద వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



భోగి మంటల్లో జిఓలు దహనం చేస్తున్న టిడిపి కార్యకర్తలు

## జీవో ప్రతులు దహనం

**ప్రజాశక్తి - రేపల్లె**

రాష్ట్రంలో కీడు తొలిగి, ఏపీ వెలగాలని టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు వైసీపీ చీకటి జీఒలను, అక్రమ కేసులను భోగిమంటల్లో వేసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు తెలిపారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి కక్షపూరిత రాజకీయాలతో రాష్ట్రానికి కీడు పట్టిందని అన్నారు. ఈ సంక్రాంతితో కీడు వదిలి చంద్రబాబు నాయకత్వంలో వెలగాలనే సంకల్పంతో భోగి మంటల వేడుకలు నిర్వహించినట్లు చెప్పారు. భోగి మంటల్లో చీకటి జీఒలు, చంద్రబాబు, లోకేష్, టీడీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసుల ఎఫ్ఐఆర్ ప్రతులను భోగి మంటల్లో వేశామన్నారు. ప్రజలందరికి భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జగన్‌రెడ్డి చీకటి పాలనను భోగి మంటల వెలుగుల్లో తరిమికొట్టాలని కోరారు. ప్రజలందరికి కష్ట, నష్టాలు తొలగి స్వేచ్ఛాయుత జీవితం గడపాలంటే వైసిపి పాలన అంతానికి ఈ సంక్రాంతి ఆరంభం కావాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవి నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, తేజ పాల్గొన్నారు.



వైద్యశిభిరంలో మాట్లాడుతున్న కె రామకోటేశ్వరరావు

## గంగవరంలో వైద్యశిబిరం

**ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్**

మండలంలోని గంగవరంలోని ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం నిర్వహించారు. స్థానిక మంచాల వెంకటరామయ్య, రంగమ్మ విద్యా వైజ్ఞానిక కళ్యాణ మండపంలో జరిగిన శిబిరంకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైద్యులు అందరికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. షుగర్, బిపి ఉన్నవారికి పరీక్షలు చేసి కేవలం రు.200కు నెలకు సరిపడు మందులు అందజేశారు. మాగిశెట్టి చంద్రమ్మ, తంగా రామాంజమ్మ, వెంకటనరసయ్య, మద్దాల కృష్ణమూర్తి స్మారకార్ధం కుటుంబ సభ్యులు మద్దాలి రంగారావు, రంగమణి, సరళ సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మంచాల రమేష్‌కుమార్, అన్నంరాజు సాంబయ్య, కరి హారిక, కొత్త రాజేంద్ర, బోడావుల శ్వేతశ్రీ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో శిబిరం కన్వీనర్ కరి బాలచంద్రం, వై సిద్ధయ్య, కందిమళ్ళ రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

# 'బాపట్ల'లో వైసిపి, టిడిపి అభ్యర్థులు ఖరారైనట్టేనా..?

◆ అయినా మార్పులుంటాయని ప్రచారం ◆ అందరిచూపూ చీరాల, పర్చూరు వైపే..

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

జిల్లాలో వైసిపి, టిడిపి అభ్యర్థులను ఆయా అధిష్టానాలు దాదాపుగా ఖరారు చేసినట్లేనని ఆయా పార్టీ శ్రేణులంటున్నాయి. అయినప్పటికీ కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు పార్టీల అభ్యర్థుల్లో మార్పులుంటాయని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. ప్రతి ఎన్నికల్లోనూ చీరాల నుంచి ప్రధాన పార్టీల తరఫున ఎవరు పోటీ చేస్తారనే విషయమై చివరివరకు సస్పెన్స్ ఉంటుంది. అది ఈ ఎన్నికల సీజన్‌లో కూడా పునరావృతమవుతోంది. చీరాల నుంచి వైసిపి తరపున కరణం వెంకటేష్ పోటీ చేస్తారని పార్టీ అధిష్టానం గతంలోనే ప్రకటించింది. ఈ మేరకు ప్రథమంగా చీరాలలోనే సామాజిక సాధికార యాత్రను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కరణం వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో ఈ యాత్రను బాపట్లలో నిర్వహించారు. ఈ నెల 22న చీరాలలో సాధికార యాత్రను చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్‌తో పాటు పలువురు వైసిపి నేతలు పాల్గొనున్నారు. అయితే పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న ఆమంచి కృష్ణమోహన్ కూడా చీరాల వైసిపి టిక్కెట్‌ను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత జగన్ మాత్రం ఆమంచిని పర్చూరు నుంచే పోటీ చేయించాలన్న ఆలోచనతోనే అక్కడకు పంపినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం పార్టీ అధినేత జరుపుతున్న సర్వేల ప్రకారం ఆమంచిపై పర్చూరులో వ్యతిరేకత ఉందని నివేదిక వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పర్చూరు నుంచి పోటీకి అక్కడ ఉన్న అన్ని గ్రూపుల వారినీ కలుపుకుపోగలిగిన కొత్త కాపు కోసం అన్వేషణ జరుగుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమంచి తాడేపల్లి వెళ్లి పార్టీ పెద్దలను కలవడం మళ్లీ చర్చనీయాంశమైంది. చీరాల వైసిపి టిక్కెట్ కోరుతూ ఆమంచి పార్టీ పెద్దలను కలిసినట్లు ప్రచారంలో జరుగుతోంది.

టిడిపి చీరాల ఇన్‌ఛార్జిగా ఎంఎం కొండయ్య వ్యవహరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. అయితే చీరాల స్థానం నుంచి టిడిపి అభ్యర్థి రంగంలో ఉంటారా? లేక ఈ స్థానాన్ని పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయిస్తారా? అనేదీ సందిగ్ధంలో ఉంది. జనసేన ప్రతి జిల్లాలో ఒక స్థానం నుంచి అయినా పోటీ చేయాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు ప్రకాశం జిల్లాలో దరిశి కేటాయించినట్లు సమాచారం. జిల్లాలో జనసేనకు కేటాయించాల్సి వస్తే అది చీరాల అవుతుందని చెబుతున్నారు. రాష్ట్రంలో జనసేనకు టిడిపి 36 స్థానాలు కేటాయిస్తున్నట్లు అందులో చీరాల కూడా ఉన్నట్లు ఒక జాబితా సామాజిక మాధ్యమాల్లోకొచ్చింది. టిడిపి అధినేత చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన 'రా కదిలిరా..' సభల్లో భాగంగా ఈ నెల 29న చీరాల వస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎంఎం కొండయ్య ఏర్పాట్లు చేస్తున్నారు.

బాపట్ల నుంచి కోన రఘుపతి తిరిగి వైసిపి అభ్యర్థిగా ఖరారయ్యారు. అయితే బాపట్లలో రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు కోన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ తమ వర్గానికి చెందిన వారినే అభ్యర్థిగా నిలపాలని లేదంటే తమ దారి తాము చూసుకుంటామని ప్రకటనలు చేస్తున్నారు. కానీ కోన మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా తన ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

అద్దంకి నుంచి వైసిపి ఇన్‌ఛార్జిగా పాణెం హనిమిరెడ్డిని ఇటీవల నియమించారు. రానున్న ఎన్నికల్లో ఈయనే పోటీ చేయనున్నారు. అద్దంకి వైసిపి టిక్కెట్‌ను ఆశించి జగన్ చెప్పినట్లు గడపగడపకూ తిరిగిన బాచిన కృష్ణచైతన్యను పార్టీ అధినేత పక్కనపెట్టారు. తనను ఇన్‌ఛార్జి పదవి నుంచి తప్పించడాన్ని ఏమాత్రం అంగీకరించని కృష్ణచైతన్య తుదిగా ఎన్నికల్లో తానే పోటీ చేస్తానని ప్రకటించి నియోజకవర్గంలోని మండలాల వారీగా తన వర్గీయులతో సమావేశాలు పెడుతున్నారు. కొత్త ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి వైపు తన గ్రూపు వారు వెళ్లకుండా నిలువరిస్తున్నారు. ఈ నేపథ్యంలో హనిమిరెడ్డిని అందరికీ పరిచయం చేస్తూ పెట్టవలసిన పరిచయ సభ వాయిదా పడింది. రేపల్లె నుంచి ఇన్‌ఛార్జీగా ఉన్న మోపిదేవి వెంకటరమణను తప్పించి ఈపూరు గణేష్‌ను ఇన్‌ఛార్జీగా నియమించారు. ఈ మార్పుతో స్థానికంగా తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. అయినప్పటికీ మోపిదేవి అందరికీ సర్దిచెబుతూ నూతన ఇన్‌ఛార్జి గణేష్‌ను అందరికీ పరిచయం చేస్తూ అసంతృప్తివాదులను సమాధానపరిచే కార్యక్రమం చేపట్టారు. ప్రకాశం జిల్లా, కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న వరికూటి అశోక్‌బాబును వేమూరుకు తెచ్చారు. వేమూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా ఉన్న మేరుగు నాగార్జునని అక్కడి నుంచి సంతనూతలపాడుకు పంపారు. నాగార్జున వేమూరులో సభ పెట్టి నూతన ఇన్‌ఛార్జి అశోక్‌బాబును వైసిపి క్యాడర్‌కు పరిచయం చేశారు. వేమూరు టిడిపి అభ్యర్థిగా నక్కా ఆనందబాబు, బాపట్ల నుంచి వేగిశన నరేంద్రవర్మ, రేపల్లే నుంచి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, అద్దంకి నుంచి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, పర్చూరు నుంచి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు టిడిపి తరపున ఎన్నికల బరిలో నిలవనున్నారు.

# కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

**ప్రజాశక్తి-మార్కాపురం**

అంగన్‌వాడీల సమ్మె 34వ రోజుకు చేరింది. ప్రభుత్వం మాత్రం ఎలాంటి పరిష్కారం చూపకపోగా ఏకంగా ఎస్మా ప్రయోగించింది. అంగన్‌వాడీలు మాత్రం బెదరలేదు. ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సమ్మె కొనసాగుతోంది. ఆదివారం నాడు భోగి పండుగ సందర్భంగా ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా ప్రతులను భోగి మంటల్లో అంగన్‌వాడీలు తగలబెట్టారు. మార్కాపురంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా కొనసాగుతున్న సమ్మె శిబిరంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు డి.సోమ య్య, పి.రూబెన్, జె.నాగరాజు, మార్కాపురం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి అందె నాసరయ్య, జిల్లా ఎఐటియుసి కార్యదర్శి షేక్ ఖాశిం తదితరులు నాయకత్వం వహించగా మద్దతుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఓ.వీరారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

**కనిగిరి:** అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలకు పరిష్కారం కోరుతూ కనిగిరి పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం 34వ రోజుకు చేరుకుంది. భోగి పండుగ కావడంతో భోగిమంటల్లో ఎస్మా చట్టం జీవో కాపీలను దగ్ధం చేసి అంగన్వాడీలు నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని ఉపయోగించిన అంగన్వాడీలను బెదిరించలేరని పోరాటం ఆగదని అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ సుజాత, సీత, రజిని, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌందర్య, రామ సుబ్బులు, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, జెవివి నాయకులు జి శ్రీనివాసులు, ఐద్వా నాయకులు ఎస్కే బషీర, శాంతకుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

**కొండపి:** కొండపిలోని అంగన్వాడీ నాయకులు, కార్యకర్తలు సమ్మె దగ్గర భోగి మంటలలో జీవో నెం.2 కరపత్రాలను దహనం చేశారు. ఆదివారం నాడు భోగిపండుగ సందర్భంగా వేకువజామునే వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కెజి మస్తాన్, సిఐటియు నాయకులు గంటెనపల్లి శ్రీనివాసరావు అంగన్వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించటాన్ని నిరసిస్తూ జీవో నెంబర్ 2ను భోగిమంటలలో దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వందనం, అంగన్వాడీ నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

**టంగుటూరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బయటకు వచ్చి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించే విధంగా చర్చలు జరపాలని సిఐటియు నాయకులు టంగుటూరి రాము, వేశపోగు మోజెస్ తదితరులు డిమాండ్ చేశారు. ఆదివారంతో అంగన్వాడీల సమ్మె 34వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం సరైన రీతిలో సమస్యల పరిష్కారానికి చర్చించకపోవడం దారుణమని అన్నారు. అనంతరం ప్రభుత్వం తెచ్చిన ఎస్మా చట్టం కాపీ ప్రతులను సిఐటియూ నాయకులు భోగిమంటలలో వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు బి శేషమ్మ, జి సుభాషిణి, శ్రీదేవి, జి ప్రసన్న, లక్ష్మి, ఆశాబీ తదితరులు పాల్గొన్నారు.

**మద్దిపాడు:** జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో



కనిగిరిలో భోగి మంటల్లో జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీలు

2 ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆ జీవో కాపీలను భోగిమంటల్లో దహనం చేశారు. మండల కేంద్రమైన మద్దిపాడులో అంగన్వాడీలు చేపట్టిన దీక్ష శనివారం 34వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరిని విడిచిపెట్టి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు, ఉబ్బా ఆదిలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు జయప్రద, ధనలక్ష్మి, అంగన్వాడీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

**వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..**

అంగన్వాడీల దీక్షలకు మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం మద్దిపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో జీవో 2 కాపీని మంటల్లో దహనం చేసి నిరసన తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బ వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రామకృష్ణ, అంబేద్కర్ యూత్ ఫోర్స్ పాల్గొన్నారు.

**నాగులుప్పలపాడు:** రాష్ట్ర ప్రభుత్వం తమపై ఎస్మా ప్రయోగించిన షోకాజ్ నోటీసులు జారీచేసినా బెదిరేది లేదని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదంటూ బోగి పండగ రోజైన ఆదివారం 34వ రోజు సమ్మె కొనసాగించారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని ఉద్యోగ విరమణ తరువాత పింఛన్ సౌకర్యం కల్పించాలని, జీతం పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు నాయకులు జి బసవపున్నయ్య మద్దతు తెలిపి ప్రభుత్వం దిగివచ్చి అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. షోకాజ్ నోటీసులను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ నాయకులు వెంకట సుబ్బమ్మ, దుర్గాభవాని, అరుణ, రమ, రజని, వివిధ గ్రామాల అంగన్‌వాడీలు, హెల్పర్స్ పాల్గొన్నారు.

**వెలిగండ్ల:** వెలిగండ్ల ప్రాజెక్టు పరిధిలో 34వ రోజు ఆదివారం భోగిమంటల్లో ఎస్మా చట్టం కాపీలు దహనం చేశారు. అనంతరం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు తాతపూడి ప్రమీల మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రాయల మాలకొండయ్య, గూడూరు సాలోమి, హామీమ్మ, ఎస్ మరియమ్మ, పద్మ, సువర్ణ, ఫ్లోరెన్సీ, మరియకుమారి, సత్యవతి, విజయ్ కుమారి, నీలమ్మ, ట్రైనీ, సువార్త, దీనమ్మ, అరుణ, చెన్నమ్మ, భూషణం, ఎలిశమ్మ, అరుణ, ఎస్తేరు, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

**యర్రగొండపాలెం:** యర్రగొండపాలెంలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 34వ రోజుకు చేరిన సందర్భంగా ఆదివారం భోగి పండుగను పురస్కరించుకొని ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు ఆడి అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 2 కాపీలను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ, అంగన్‌వాడీ నాయకురాళ్లు మల్లేశ్వరి, పి సుభాషిణి, ఎ నాగమల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సిహెచ్ సునీత, అరుణ, కే జయమ్మ, ఏ నాగరాజుకుమారి, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

**పెద్ద దోర్నాల:** అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం భోగి మంటల్లో జీవో నెంబర్ 2 కాపీలను దహనం చేశారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**హనుమంతునిపాడు:** అంగన్‌వాడీ ఉద్యమాన్ని అణచాలనే దురుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడాన్ని నిరసిస్తూ ఈ సందర్భంగా తీసుకొచ్చిన జీవో నెంబర్ రెండును భోగిమంటల్లో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి అక్క చెల్లెమ్మల న్యాయమైన సమస్యలను పరిష్కారం చేసే వైపు నుంచి కాకుండా వారిపై నిర్బంధాన్ని ప్రవేశిస్తే సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకుడు జి శ్రీనివాసరెడ్డి స్థానికులు పాల్గొన్నారు

**కంభం రూరల్:** పట్టణంలోని కందులాపురం సెంటర్ లో అంగన్వాడీ కార్యకర్తలు భోగి పండగ రోజు ధర్నా శిబిరం దగ్గర భోగిమంటలేసుకొని ఎస్మా చట్టాన్ని, నోటీసులను భోగిమంటలలో వేసి నిరసన వ్యక్తం చేశారు. అత్యంత ముఖ్యమైన పండుగ సంక్రాంతి పండుగని, ఈ పండుగ కూడా ధర్నా శిబిరం దగ్గర జరుపుకోవడం చాలా బాధాకరమని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మా యొక్క సమస్యలు పరిష్కరించాలని ఏదైతే రాష్ట్ర ప్రభుత్వం చెప్పుందో ఆ ఇచ్చే హామీని రాతపూర్వకంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు సమ్మె కొనసాగుతుందని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంగన్వాడీ యూనియన్ నాయకులు అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

**దొనకొండ:** డిమాండ్ల సాధన కోసం గత 34 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతుగా సీఐటియు ఆధ్వర్యంలో దొనకొండలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని, సమాజంలో అట్టడుగు వర్గాలకు సేవలందిస్తున్న వీరి పట్ల ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటియు కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కార్యకర్తలు కుందుర్తి అనీల్, కోలా కిరణ్, కర్ణా కృష్ణా, ఎం అంజిబాబు, శ్రీకాంత్, ఏసుదాసు, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

**దర్శి:** అంగన్‌వాడీ కార్యకర్తలు ఐసీడీఎస్ కార్యాలయం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సంక్రాంతి పండుగలో కూడా సమ్మె జరుపుకుంటున్నామని, జీతాలు పెంచే వరకు సమ్మె కొనసాగుతుందని సంఘ నాయకులు తిరుపతమ్మ తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎమ్మెల్యేలకు నెలకు రూ.2.50 లక్షలు ఇస్తూ అంగన్‌వాడీలకు రూ.11,500 ఇవ్వడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలమ్మ, నాగమణి, సుజాత, నరసమ్మ, జయమ్మ, లక్ష్మీ, మల్లేశ్వరి, వెంకటరమణ, దేవిబాయి, సందు వెంకటేశ్వరరావు, తాండవ రంగారావు, కేవీ పిచ్చయ్య, రంగనాయకులు, నారాయణ పాల్గొన్నారు.



ప్రతులు దహనం చేస్తున్న యుటిఎఫ్ నేతలు

## జీవో ప్రతులు దహనం

**ప్రజాశక్తి-మార్కాపురం:** ప్రభుత్వ నిరంకుశ వైఖరి ప్రతులను యుటిఎఫ్ ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయ ప్రాంగణంలో భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు ఆదివారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒద్దుల వీరారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ బి శ్రీరాములు, జిల్లా కార్యదర్శి పి ప్రభాకర్, ప్రాంతీయ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాపయ్య, చంద్రశేఖర్, శేషు, యోగయ్య, శ్రీనివాస్ నాయక్, సుబ్బారావు, శ్రీనివాసులు, కాశిరెడ్డి, అల్లూరి శ్రీను, రామారావు, టిపి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**పొదిలి:** పొదిలి యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట భోగిమంటల్లో సంబంధిత జీవో ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, జిల్లా కార్యదర్శి పి బాలవెంకటేశ్వర్లు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు, కొనకనమిట్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె నాసర్ మొహమ్మద్, ఎస్ కామేశ్వరరావు, పొదిలి మండల ప్రధాన కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, పి శ్రీనివాసులురెడ్డి, కే సంజీవ రావు, వేమూరి శ్రీనివాసులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న జనసేన, టిడిపి నాయకులు

## జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**ప్రజాశక్తి-ముండ్లమూరు:** జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొనడం అభినందనీయమని జనసేన దర్శి నియోజకవర్గ నాయకులు గరికపాటి వెంకట్ అన్నారు. ఆదివారం మండలంలోని వేంపాడు, ఈదర, దర్శి మండలం తూర్పువీరాయపాలెం గ్రామంలో గరికపాటి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేంపాడులో మొదటి బహుమతి కావూరి సుస్మిత, రెండో బహుమతి బోడపాటి లక్ష్మీపూజ, మూడో బహుమతి కొప్పునేని వెంకట శ్రావణి గెలుచుకున్నారు. వీరికి బహుమతులను గరికపాటితో పాటు మేదరమెట్ల వీరయ్య చౌదరి, తాళ్లూరి నారాయణస్వామి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మైనంపాడులో సంక్రాంతి ఆటలు

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**

సంక్రాంతి సందర్భంగా మండలంలోని మైనంపాడు గ్రామంలో విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హాకీ, వాలీబాల్ తదితర పోటీలను నిర్వహించారు. గ్రామంలోని హైస్కూల్ గ్రౌండ్లో ఈ పోటీలను నిర్వహించారు. హాకీ పోటీలను గ్రామ మాజీ ఎంపిటీసీ ముళ్ళమూరి చంద్రశేఖర్ ప్రారంభించారు. హాకీ, వాలీబాల్ పోటీలలో ఎనిమిదేసి టీములు పాల్గొన్నాయి. గ్రామ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 1988 నుంచి 2019 వరకు సంక్రాంతి ఆటల పోటీలను నిర్వహించారు. 2019 నుంచి వారి వారసత్వంగా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు పెరుగు భాను ఏ భగత్‌సింగ్, ఎస్కే నాయబ్, ఎస్కే కమాల్, గుండవరపు సుబ్బారావు, కరిచేటి హనుమంతరావు, బత్తుల సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు.

**నేడు విఎస్ఆర్ రాక**

మండలంలోని మైనంపాడు గ్రామానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు రానున్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహిళలచే కోలాట ప్రదర్శన జరుగనుంది. ఈ కార్యక్రమానికి వి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా రానున్నారు.

## అగ్ని ప్రమాదంపై కేసు నమోదు

**ప్రజాశక్తి-కురిచేడు**

మండలంలోని ఆవులమంద గ్రామ పంచాయతీలోని ముష్టి గంగవరం గ్రామంలో శనివారం రాత్రి 10 గంటల సమయంలో మెగా ఫుడ్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో సుమారు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ చెందిన కొందరు పారిశ్రామికవేత్తలు 1999లో ఈ ఫుడ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. కరోనా సమయంలో పూర్తిగా ఉత్పత్తి నిలిపివేసిన యాజమాన్యం ఇటీవల ఆరు నెలల కాలం నుంచి తిరిగి ఉత్పత్తి ప్రారంభించింది. కాగా శనివారం రాత్రి పది గంటల సమయంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఫ్యాక్టరీలో మంటలు చెలరేగడంతో గుర్తించిన సిబ్బంది వినుకొండ ఎర్రగొండపాలెం అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం అందించారు. ఆయా కేంద్రాల అగ్నిమాపక దళాలు రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చాయి. ఈ ప్రమాద ఘటనపై జనరల్ మేనేజర్ ప్రసాద్ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా దర్శి డిఎస్పి అశోక్‌వర్ధన్‌రెడ్డి, త్రిపురాంతకం సిఐ పాపారావు, స్థానిక ఎస్ఐ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బిసివై పార్టీ నేత నారాయణ మృతి

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్**

గిద్దలూరు మండలం నరవ బైయినపల్లె గ్రామానికి చెందిన పెట్టల నారాయణ యాదవ్(60) గుండెపోటుతో మృతి చెందారు. చెన్నై అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో మృతి చెందిన నారాయణ యాదవ్‌ను వారి కుటుంబ సభ్యులు అంత్యక్రియల కోసం తన స్వగ్రామమైన నరవ బైయినపల్లికి తరలించారు. నారాయణ యాదవ్ బీసీవై పార్టీలో క్రియాశీలక నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటించారు. నారాయణ యాదవ్ అంత్యక్రియలు సోమవారం నరవబైయినపల్లి గ్రామంలో జరుగుతాయని కుటుంబ సభ్యులు వెల్లడించారు.



రైతు భారతం నాటిక పోటీల్లో సన్నివేశం

## రసవత్తరంగా నాటిక పోటీలు

**ప్రజాశక్తి -యద్దనపూడి**

ఎన్‌టిఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 4వ రోజు కపిరాజు, కాపలా, రైతు భారతం నాటికలను ప్రదర్శించారు. మొదటి నాటికకు కందిమళ్ళ సూపర్ స్పెషాలిటీ చిలకలూరిపేట వారు రూ.20వేలు, 2వ నాటికకు వరగాని ముద్దన రాఘవయ్య చౌదరి రూ.20 వేలు, 3వ నాటికకు పరిషత్ రూ.20వేలు పారితోషకం అందించారు. నేటి పోటీలకు సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, సినీ నటుడు అజయ్ గోష్ అతిధులుగా హాజరు అవుతారని తెలిపారు. కార్యక్రమంలో తెళ్ళ అరుణ, చంద్ర లత, మారేళ్ళ ఇందిరా, పాండు రంగారావు, ఆర్ శ్రీను పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ బకాయిలు చెల్లించాలి

**ప్రజాశక్తి - నిజాంపట్నం**

ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగ, ఉపాధ్యాయులను శత్రువులుగా చూస్తూ తమకు రావలసిన బకాయిలను సైతం ప్రభుత్వం వాడుకుని, బకాయిలు అడిగినందుకు తిరిగి ఉద్యోగ, ఉపాధ్యాయులపైనే అక్రమ కేసులు పెడుతూ, తాము ఉద్యోగుల పక్షపాతుల మని మోసపూరిత మాటలు చెబుతున్న ప్రభుత్వ వైఖరికి నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో భోగి మంటల్లో ప్రభుత్వ ఉత్తర్వులను దగ్ధం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య కుటుంబ సభ్యులు ప్రభుత్వ వైఖరి పేపర్ కటింగ్లు, ప్రకటనలు భోగిమంటల్లో వేసి నిరసన తెలిపారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగుల పట్ల ప్రజల్లో తప్పుడు అభిప్రాయం కలిగించేవిధంగా వ్యవహరించడం తగదని అన్నారు. తమ బకాయిలు, పిఆర్సి, డిఎ ఎరియర్లు రూ.7,382కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ.4500 కోట్లు, ఎపిజిఎల్ఐ క్లైములు రూ.330కోట్లు, 12వ పిఆర్సి విధి విధానాలు వెంటనే రూపొందించాలని, పిఆర్సి వచ్చేవరకు 30శాతం ఇంటరీయం రిలీఫ్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.



క్రికెట్ అసోసియేషన్ మీట్‌కు హాజరైన క్రీడాకారులు

## క్రికెట్ అసోసియేషన్ మీట్

**ప్రజాశక్తి - బాపట్ల రూరల్**

స్థానిక బిఇసి క్రికెట్ గ్రౌండ్ నందు బాపట్ల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెటర్నన్ క్రికెట్ మీట్ ఆదివారం నిర్వహించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ మానం నాగేశ్వరరావు మాట్లాడారు. ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు గత ఎనిమిది సంవత్సరాలుగా మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఎక్కువగా వెటరన్ యువ క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. క్రీడల్లో సీనియర్ క్రికెటర్లైన బందా బాబు, మదన్, విజయుడు, మహేష్, దొప్పలపూడి రామ్మోహన్, కె రఘునాథ్, వై నరేష్ బాబు, కె సత్తిపండు, బక్క రోశయ్య, గంట అంజిబాబు, సురేష్ వర్మ, జానీ, నరేంద్ర, కరీమ్, స్టాన్లీ పాల్గొన్నారు. విజేతలకు మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ లేళ్ల రాంబాబు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు లేళ్ల నరేంద్ర జ్ఞాపికలను బహుకరించారు.

## మద్యం అక్రమంగా ఉంటే చర్యలు

**ప్రజాశక్తి - బాపట్ల రూరల్**

అక్రమంగా మద్యం కలిగి వుంటే చర్యలు తప్పవని ఎస్ఇబి సీఐ సుంకర శ్రీనివాసులు హెచ్చరించారు. అతని వద్ద నుంచి ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బేతపూడిలో బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. రెండు సంఘటనల్లో 13మద్యం బాటిళ్లు, 450లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని తెలిపారు.

# ప్రజల ఆస్తులకు రక్షణ లేదు



భూ హక్కు చట్టం రద్దు చేయాలని న్యాయవాదుల దీక్షలు

**ప్రజాశక్తి - బాపట్ల రూరల్**

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన భూ యాజమాన్యం చట్టం వలన ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలా కృష్ణ అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ చట్టానికి వ్యతిరేకంగా న్యాయవాదులు ఐదు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కొందరు వైసీపీ నాయకులు, మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ చట్టం మంచిదని, ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ చట్టం పూర్తిగా ప్రజా వ్యతిరేక చట్టం అన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన న్యాయ వ్యవస్థ నుండి భూ వివాదాల పరిష్కారం తొలగించి రెవెన్యూ కోర్టుల ద్వారా పరిష్కారం జరగాలనేది ప్రభుత్వం ఉద్దేశ్యం అన్నారు. దీని వల్ల ప్రభుత్వ కను సైగల్లో ఏక పక్ష తీర్పులు వస్తాయని అన్నారు. దీని వలన సామాన్య ప్రజలకు న్యాయం జరగదని అన్నారు. రాజకీయ నాయకుల వత్తిళ్ళతో తీర్పులు ఉంటాయని అన్నారు. ఆస్తులకు భద్రత ఉండదని అన్నారు. చట్టాన్ని రద్దు చేసి, స్వయం ప్రతపత్తి కలిగిన న్యాయ వ్యవస్థనే పరిధిలోనే కొన సాగించాలని కోరారు. న్యాయస్థానాల సంఖ్య పెంచి త్వరితగతిన పెండింగ్ కేసులు పరిష్కారం కోసం ప్రభుత్వం పని చేయాలని అన్నారు. రాజ్యాంగం ద్వారా ఏర్పడిన న్యాయ స్థానాలను నిర్వీర్యం చేయాలనే ప్రభుత్వ ఉద్దేశ్యం మానుకోవాలని అన్నారు. ఈ చట్టం రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా వివిధ మార్గాల్లో పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. రద్దు అయ్యే వరకు పోరాటం ఆగదని అన్నారు. దీక్షలో న్యాయవాదులు తడవర్తి రామకృష్ణ, ఊసా తులసిరామ్, భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.

**భట్టిప్రోలు :** రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు చట్టాన్ని మార్పు చేసిందని, దీని వలన ప్రతి ఒక్కరికి భూ హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని సిపిఐ ఏరియా కార్యదర్శి గొట్టు ముక్కల బాలాజీ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద భూ హక్కు చట్టం జీఓ కాపీలను భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ చట్టం ప్రకారం తమ సొంత భూమిని కూడా సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయంతో సంబంధం లేకుండా కేటాయించిన అధికారి ధృవీకరణ చేస్తేనే భూ హక్కు ఉంటుందని అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈపాటికే దేశవ్యాప్తంగా మేధావులు, న్యాయవాదులు, రైతు సంఘాలు ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపట్టినట్లు తెలిపారు. సిపిఐ నాయకులు బండారు శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు, చేతి వృత్తిదారుల సంఘం నాయకులు రామకోటేశ్వరరావు, రామారావు, పెద్దిరాజులు, న్యాయవాది జి దుర్గ పాల్గొన్నారు.



భూ హక్కు చట్టం ప్రతులను దగ్ధం చేస్తున్న సిపిఐ నేతలు

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



విద్వాన్ చంద్రమౌళికి ఘన సన్మానం

**ప్రజాశక్తి - అద్దంకి**


స్థానిక శ్రీ ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 40ఏల్ల క్రితం చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఉపాధ్యాయులు కోవి శ్రీనివాస రావు, నాగసూర్ సుబ్బారావు ప్రధాన బాధ్యులుగా గత 12ఏళ్ల క్రితం తొలిసారి కలిశారు. మళ్లీ ఇది రెండోసారి ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఆత్మీయ కలయికలో సుమారు 100మందికిపైగా హాజరయ్యారు. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, నాగయ్య, ఎస్‌కె పాశ్చామియ, కోటేశ్వరరావు, రోజులీల హాజరయ్యారు. ఘనంగా సన్మానించి, స్పందనలు వినిపించారు. చంద్రమౌళి మాస్టర్ మాట్లాడుతూ తాను కూడా ఈ హైస్కూల్ విద్యార్థినేనని చెప్పారు. ఈ హైస్కూల్లో ఆరేళ్లు చదువుకున్నట్లు, 25ఏళ్లు ఉపాధ్యాయుడుగా చేసినట్లు చెప్పారు. నాటి విద్యార్థి మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ మనం గౌరవంగా జీవితంలో అభివృద్ధి చెందాలంటే విద్యార్థి దశలో లాగే జీవితాంతం చదువుతూ, నేర్చుకుంటూనే ఉండాలని అన్నారు. అప్పుడే మనం కానీ, మన బిడ్డలు కాని అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలమని అన్నారు. డబ్బుతో విలువలను కొలిచే ప్రస్తుత రోజుల్లో మానవత విలువలను కోల్పోతున్నారని అన్నారు. గత 10ఏళ్లకుపైబడి ఈ హై స్కూల్ నందు మెరిట్ విద్యార్థులకు నగదు పారితోషకం తమ బృంధం నుండి అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బత్తుల శ్రీనివాసరావు, అలహరి శ్రీనివాసరావు, బత్తుల రాజశేఖరరెడ్డి, మైనంపాటి రంగారావు, చిన్ని శ్రీనివాసరావు, గట్టుపల్లి రామారావు, కరి శ్రీను, కర్రీ ప్రసాద్, మోటుపల్లి శివరామకృష్ణ ప్రసాద్, పమిడిగటం చంద్రశేఖర్, కరి రవి, పరిటాల పవన్, ముప్పనేని మాధవి లత, జి శైలజ, ఎన్ లక్ష్మీ గాయత్రి, తెలగతోటి మంజుల, పద్మావతి పాల్గొన్నారు.

**వేటపాలెం :** మండలంలోని బిబిహెచ్ కాలేజీలో 1995 – 96లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సంక్రాంతి సందర్భంగా కలిశారు. వివిధ హోదాలో ఉన్న అప్పటి విద్యార్థులు హాజరయ్యారు. మండలంలోని నిరుద్యోగులకు తమ వంతు సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్మీ పేరిశెట్టి వెంకటనారాయణ, ఎమ్మెస్ క్యాషఉ్యస్ అధినేత షేక్ జిలాని, కాపు సంఘం నాయకులు ముంగర పూర్ణచంద్ర రావు, ఆలపాటి వెంకట సుబ్రహ్మణ్యం, లేళ్ల సోమశేఖర్, బొమ్మల రవి కిరణ్, చేగుడి ఎబినేజర్, ఆర్మీ అవల్దార్ పొగడ దండ ఆదిశేషు, దారా రవికుమార్, ఆలపాటి సుబ్బారావు, 95– 96 బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# దోమల నివారణ చర్యలు చేపట్టాలి

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం పంచాయితీలోని వీరయపాలెంలో పారిశుద్ధ్య లోపంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడున్నారు. మురుకి నీరు రోడ్లపైనే పారుతుంది. దీంతో దోమలు పెరుగుతున్నాయి. రాత్రుల్లో ప్రజలకు నిద్రలేకుండా చేస్తున్నాయి. దోమలు కుట్టిన చోట బెందులు వస్తున్నాయని, మరుసటి రోజు దురద వస్తుందని ప్రజలు వాపోతున్నారు. మరి కొందరు విషజ్వరాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ సౌకర్యం కల్పించి మురుగు నీరు రోడ్లపై లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డుపైనే పారుతున్న మురుగునీరు

బ్లీచింగ్, డిడిటిలను పిచికారి చేయించి దోమలను నివారించాలని కోరుతున్నారు.



ప్రారంభమైన అన్నదానం కేంద్రం

## వృద్ధులకు నిత్యం అన్నామృతం

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

స్థానిక గొనసపూడిలోని పేద ప్రజలు, వృద్ధుల ఆకలి తీర్చేందుకు విక్రం నారాయణ కుటుంబం ముందుకు వచ్చింది. అందుకు అవసరమైన భవనాన్ని స్థానిక పోలేరమ్మ గుడి సమీపంలో నిత్య అన్నామృత అన్నపూర్ణేశ్వరి భవనం విక్రమ్ నారాయణ కుటుంభం పేరిట నిర్మించారు. నిత్యం అన్నామృతానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా గ్రామంలోని పేద వృద్ధులకు, మహిళలకు అన్నామృత కార్యక్రమాన్ని భోగి పండుగ సందర్భంగా ఆదివారం ప్రారంభించారు. రోజు వృద్ధులు భోంచేసి అవసరమైతే అక్కడే విశ్రాంతి తీసుకోవచ్చని విక్రమ్ నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో విక్ర0 నారాయణరావు తండ్రి విక్రం వెంకట్రావు, విక్ర0 అజయ్ బాబు దంపతులతోపాటు సర్పంచి విక్రం నారాయణరావు, దీప్తి, మాజీ సర్పంచ్ బత్తుల కళ్యాణి, టిడిపి బాపట్ల పార్లమెంటరీ వాణిజ్య విభాగం కార్యదర్శి కొండ్రగుంట్ల శ్రీహరి బాబు, బత్తుల శీను, టిడిపి చినగంజాం మండల అధ్యక్షులు పోద వీరయ్య, శేషగిరిరావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు పంపిణీ

**ప్రజాశక్తి - మేదరమెట్ల**

మండలంలోని రావినూతల జెడ్‌పి పాఠశాల్లో ప్రతిభ చూపించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఆదివారం బహుమతులు ప్రధానం చేశారు. యలగాల సుబ్బారావు స్మారక ప్రతిభ పోటీల పరీక్షల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.15వేలు, 2వ బహుమతి రూ.10వేలు, 3వ బహుమతి రూ.5వేలతోపాటు కన్సోలేషన్ బహుమతులు రూ.30వేలు నగదు, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా యలగాల సుబ్బారావు కుమారుడు డాక్టర్ గోపికృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఆర్థికంగా ఉపయోగపడటంలో సంతోషం, సంతృప్తి ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో చీరాల ఉప విద్యాధికారి ఆర్ శ్రీనివాసరావు, స్థానిక పాఠశాల హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు పూనాటి హరిబాబు, కె శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పుట్టావారిపాలెంలో సంబరాలు

**ప్రజాశక్తి - సంతమాగులూరు**

మండలంలోని పుట్టావారిపాలెం రామాలయ గుడి ఆవరణలో సర్పంచి సన్నెబోయిన గురు యాదవ్ ఆధ్వర్యంలో భోగిమంటలతో సంక్రాంతి సంబరాలు ఆదివారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. యువకులకు కబడి, కోకో పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువు యాదవ్ టీం సభ్యులు బహుమతులు అందజేశారు.

**పెద్దదోర్నాల :** అన్ని గ్రామాల్లో భోగి పండుగ సంబరాలు ఘనంగా జరిగాయి, ఇళ్ల ముందు భోగి మంటలు వేసుకున్నారు. పనికి రాని వస్తువులను ఆ మంటల్లో దగ్ధం చేశారు. రేగిపండ్లుతో స్నానం ఆచరించారు.

## టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షునిగా సురేంద్ర

**ప్రజాశక్తి - వేమూరు**

మండలంలోని అద్దేపల్లి గ్రామానికి చెందిన పోకూరి సురేంద్ర కుమార్ టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులుగా ఎంపికయ్యారు.

## వెంకటేష్‌ను పరామర్శించిన మేరుగ

**ప్రజాశక్తి - చీరాల**

వైసిపి ఇన్చార్జి కరణం వెంకటేష్ బాబు హైదరాబాద్‌లోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటూ పూర్తిగా కోలుకొని శనివారం సింగరకొండలోని గుడిలో ప్రత్యేక పూజలు చేసి ఒంగోలులోని తన స్వగృహానికి చేరుకున్నారు. ఆయనను జిల్లా ఇన్చార్జి మంత్రి మేరుగ నాగార్జున, జిల్లా యువత అధ్యక్షులు మేరుగా నాగ చెంద్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట సంతనూతలపాడు చైర్మన్, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఉన్నారు.

# పల్లెల్లో కనిపించని సంక్రాంతి సంబరాలు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

గతంలో పల్లెలో ప్రతి ఇంట్లోనూ సేద్యం ఉండేది. దీంతో ఎద్దులు, ఆవులు దాదాపు ప్రతి ఇంట్లో దర్శనమిచ్చేవి. పల్లెల్లో ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా పశువుల గిట్టల చప్పుడు వినిపించేది. పశువులను తమ బిడ్డల్లాగా చూసుకునే రైతులు సంక్రాంతి పండుగ వారం రోజులు ఉండగానే పశువులకు స్నానం చేయించి రంగుల కాయితాలు, రంగురంగుల గుడ్డలతో ముసుగులు, కొమ్ములకు కుప్పెలు, ఇలా ఎంతో శ్రద్ధగా అలంకరించే వాళ్లు. కొమ్ములకు బెలూన్లు కట్టి కనుమ రోజు కాటమరాజు గుడి వద్ద ఏర్పాటు చేసే అగ్గికుప్ప వద్దకు తీసుకొచ్చేవాళ్లు. అన్ని ఎద్దుల్లో తమ ఎద్దే ప్రత్యేకంగా కనిపించాలని పోటీ పడి అలంకరించే వాళ్లు. అదంతా గతం. ఇప్పుడు ఏ పల్లెలోనూ ఎద్దులు లేవు. వందల కుటుంబాలు ఉండి వందల్లో ఎద్దులు, ఆవులు ఉండే పల్లెల్లో ఇప్పుడు ఒకటంటే ఒకటి కూడా ఎద్దులు లేవు.



కళ తప్పిన వీధుల్లో హరిదాసు

నాటు ఆవులు లేవు. ఒకమాటలో చెప్పాలంటే వ్యవసాయమే లేదు. ఒకవేళ ఉన్నా ట్రాక్టర్లు, ఇతర యంత్రాలతో సేద్యపు పనులు కానిచ్చేనస్తున్నారు. ఫలితంగా పల్లెలు పశువుల రంకెలు వినపడకుండా మూగబోయాయి. వెరసి రోజురోజుకు సంక్రాంతి పండుగ కళ తప్పింది. దీనికి తోడు పంటలు సరిగా పండక, పెట్టుబడులు అధికమై రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. పేదలు, కూలీలు ఉంటే వారికి పనులు లేవు. గ్రామాల్లో ఎక్కువ మంది వలసలు వెళ్లారు. గతంలో గ్రామానికి ఇద్దరు చొప్పున హరిదాసులు వచ్చేవారు. గంగిరెద్దుల వారు వచ్చేవారు. ప్రస్తుతం వారు రావడమే మానుకున్నారు. హరిదాసులు కూడా కూలీ పాటు పడకపోవడంతో గ్రామాల్లో తిరగడమే మానుకున్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానంటుతుండడంతో పిండి వంటల ఘుమ ఘుమలు తగ్గాయి. రంగు రంగుల ముగ్గులు కనుమరుగైపోయాయి. భోగి పండుగ రోజు తెల్లవారుజామునే ఊర్లో వారందరూ ఒకచోట చేరి భోగి మంటలు వేసేవారు. పిల్లలు గాలిపటాలు ఎగురవేస్తూ ఒకరికొకరు పోటీలు పడేవారు. కొన్నిచోట్ల క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి వినోదాన్ని పంచేవారు. కానీ డబ్బే ప్రధానమైన నేటి బిజీ జీవితంలో ఇంటికి చుట్టాలొచ్చే వారూ లేరు. ఆ అనురాగాలు లేవనే చెప్పవచ్చు. ఏది ఏమైనా కాలం కలిసి రాకపోవడంతో పల్లెల్లో సైతం సంక్రాంతి పండుగ సంబరాలు పూర్తిగా తగ్గాయి.



నగదు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

## అలరించిన ముగ్గుల పోటీలు

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

చిన్నగంజాం మండలం గొనసపూడిలో ఆదివారం జిల్లా స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 123మంది మహిళల పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ బహుమతి ఇంకొల్లుకు చెందిన చుండూరు మణి మంజరి రూ.55555, ద్వితీయ బహుమతి కడవకుదురుకు చెందిన గున్నమనేని విజయశాంతి, ఇంకొల్లుకు చెందిన మచ్చ మాధవి ఒక్కొక్కరికి రూ.25555, అందుకున్నారు. మూడో స్థానంలో గొనసపూడి గ్రామానికి చెందిన బొప్పన సురేఖ, కడవకుదురుకు చెందిన తుమ్మలపెంట విజయ దుర్గ, చీరాలకు చెందిన వలమట్ల వెంకట సుప్రజా ఒక్కొక్కరు రూ.10555 నగదు బహుమతులు అందుకున్నారు. విజేతలకు సర్పంచి విక్రమ్ నారాయణరావు, దీప్తి, విక్రం వెంకట్రావు, విక్రం అజయ్ బాబు, బాపట్ల పార్లమెంటరీ టిడిపి వాణిజ్య విభాగపు కార్యదర్శులు కొండ్రగుంట హరిబాబు, బత్తుల శీను, టిడిపి మండల అధ్యక్షులు పొద వీరయ్య, శేషగిరి అందజేశారు.

**అద్దంకి :** సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సైకో పాలనకు చరమగీతం పాడి వచ్చే సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని కోరారు.

**ఇంకొల్లు రూరల్ :** స్థానిక శ్రీ శాంతినికేతన్ రోడ్డులో ఆవులమంద సుబ్బయ్య మాస్టర్ ఇంటి వద్ద శ్రీ వరలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు వేసి ఆటపాటలతో అలరించారు. భోగి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, కుర్చీల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆవులమంద సుబ్బయ్య, రామకృష్ణ, కిరణ్ పాల్గొన్నారు.

**మార్కాపురం :** పట్టణంలోని నాయుడువీధిలో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆ సంస్థ పట్టణ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్వర్లు విజేతలకు బహుమతుల పంపిణీ చేశారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు విలువచేసే రెండు పట్టు చీరలను న్యూ కమల గ్రాండ్, కమల సిల్క్ అండ్ శారీస్ అధినేతలు పెనుగొండ కేశవరావు, నరసింహారావులు, ద్వితీయ, తతీయ బహుమతులను సెవెన్ హిల్స్ అధినేత తాటిపర్తి చెన్నారెడ్డి, సత్య సిల్క్ షాప్, వైష్ణవి సిల్క్ అధినేత బచ్చు భారతి, జయశ్రీ శిల్క్ టెక్స్టైల్ ఎస్ దుర్గా ప్రసాద్, జివి రాంబాబులు అందజేశారు. వనజాక్షి, చెన్నారెడ్డి, ఆర్‌కెజె నరసింహం, ఓం సాయి వికాస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎలిశెట్టి చలమయ్య, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బి డేవిడ్‌స్టోన్, శ్రీ వెంకటేశ్వర ఐటిఐ కళాశాల అధినేత జి రత్నంశెట్టి పాల్గొన్నారు.

## టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

**ప్రజాశక్తి-పెద్దదోర్నాల**

భవిష్యత్ గ్యారెంటీ టిడిపితోనే సాధ్యమని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పెద్ద దోర్నాల మండలం లోని నల్లగుంట్ల గ్రామంలో ఆదివారం బాబు షూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మహిళలకు టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలోని అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏరువ మల్లికార్జునరెడ్డి, నాయకులు శేషాద్రి, చంటి, శేఖర్, కాశయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



కార్యకర్తలతో టిడిపి ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు

## దళితులను చిన్నచూపు చూస్తే ఇంటికే

**ప్రజాశక్తి - చీరాల**

నియోజకవర్గంలో గణనీయంగా దళిత ఓట్లు ఉన్నప్పటికీ పెత్తనం మాత్రం అగ్రవర్ణాల చేతుల్లో ఉందని ప్రజా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుమ్మడి ఏసురత్నం అన్నారు. స్థానిక మసీదు సెంటర్లోని ఆయన కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సంతనూతలపాడు, కొండేపి ఎస్సీ రిజర్వు అయినప్పటికీ ఎమ్మెల్యే అభ్యర్థులను నిర్ణయించేది మాత్రం ఆధిపత్య సామాజిక వర్గాలేనని అన్నారు. దళితుల ఓట్లతో అధికారానికి వస్తున్న నేతలు దళితులను చిన్న చూపు చూస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిని నిర్ణయించే సత్తా చీరాల్లో తమకు ఉందని అన్నారు. పెత్తనం మాది, ఎమ్మెల్యే పేరే మీదని, నచ్చితేనే రండి అనే నినాదంతో ప్రతి దళిత వాడను, ప్రతి వార్డుని చైతన్య పరుస్తూ బుధవారం సభ నిర్వహిస్తున్నామని అన్నారు. గత 25ఏళ్లగా నియోజకవర్గంలో దళిత యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలస జీవితాలు గడిపే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దళిత యువత మేల్కొని దళిత నాయకత్వాన్ని స్వాగతించే నాయకులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పులిపాటి రాజు, కాగిత ఆదాము, శ్యామ్, కంచర్ల రాజు, రామేశ్వరం కుమార్, దేవసహాయం, జడ ఇస్సాక్ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో గుమ్మడి యేసురత్నం

## సెమీస్ ఫైనల్‌కు చెన్నై జట్లు

**ప్రజాశక్తి - మేదరమెట్ల**

రావినూతల ఆర్ఎస్‌సిఎ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భ్రమర 30వ సంక్రాంతి క్రికెట్ కప్ 2024 ఈనెల 9నుండి పోటీలు జరుగుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ పోటీల్లో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీసీసీ చెన్నై, జిఎస్టి సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్లు సెమీస్‌కు అర్హత సాధించాయి. ఆదివారం మ్యాచ్‌లో థండర్ బోల్ట్ తిరుపతి, శ్రీసీసీ చెన్నై జట్లు తలపడగా చెన్నై జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొంది. మొదట బ్యాటింగ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 123 పరుగులను మాత్రమే చేయగలిగింది. జట్టులో ముఖేష్ 42బంతుల్లో 34 పరుగులు చేసి పరవాలేదు అనిపించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తిరుపతి జట్టు 11.3 ఓవర్లలో కేవలం 44పురుగులను మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. నలుగురు బ్యాట్స్ మెన్స్ డక్ అవుట్ అవ్వటం గమనార్హం. ఏ స్థితిలోనూ చెన్నై జట్టుకు తిరుపతి జట్టు ఎదురు నిలవలేకపోయింది. చెన్నై జట్టులో తరుణ్ 2.3 ఓవర్లలో 7 పరుగులను మాత్రమే ఇచ్చి 4వికెట్లను తీసుకొని తిరుపతి జట్టు పతనాన్ని శాసించాడు. దాంతో చెన్నై జట్టు సమీస్‌కు అర్హత సాధించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో ప్రసాద్ స్పోర్ట్స్ లెవెన్ హైదరాబాద్, జిఎస్టి సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై జట్లు తలపడగా చెన్నై జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట నిర్ణీత 20ఓవర్లలో హైదరాబాద్ జట్టు 7 వికెట్లను కోల్పోయి 141 పరుగులను మాత్రమే చేసింది. జట్టులో అభి 5ఫోర్లు, రెండు సిక్సులతో 39 బంతుల్లో 56పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు 16.2 ఓవర్లలో నాలుగు వికెట్లను మాత్రమే కోల్పోయి 142పరుగులు చేసి, ఆరు వికెట్ల విజయాన్ని అందుకుంది. జట్టులో కెవిన్ 37బంతుల్లో 44 పరుగులు, సుదన్ 26 బంతుల్లో 32 పరుగులు చేసి జట్టు విజయాన్ని శాసించారు. దీంతో చెన్నైకి చెందిన రెండు జట్లు నేడు జరగబోయే సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాయి. నేటి మ్యాచ్ల మ్యాచ్‌ల వివరాలు. ఈరోజు సెమీఫైనల్స్ జరుగుతుండగా ఉదయం 9:30 గంటలకు చికోలు చీట్స్ వైజాగ్ వర్సెస్ శ్రీసీసీ చెన్నై జట్లు, మధ్యాహ్నం జీఎస్టీ సెంట్రల్ ఎక్సైజ్ చెన్నై వర్సెస్ సౌత్ జోన్ సిసి చెన్నై జట్లు తలపడనున్నాయి. క్రికెట్ అభిమానులకు పండుగతో పాటు క్రికెట్ పండుగను సెమీఫైనల్స్ ద్వారా జట్లు అందించనున్నాయని ఆర్ఎస్‌సిఏ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు తెలిపారు.



రావినూతలలో క్రికెట్ మ్యాచ్

## ఆనందబాబు విస్తృత పర్యటన

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

మాజీ మంత్రి నక్క ఆనందబాబు మండలంలో ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. భట్టిప్రోలు రైలుపేటకు చెందిన టిడిపి నాయకులు జంగం దావీదు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. గుండాల శకుంతల కుమారుడు అభిలాష ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందగా ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, టిడిపి మండల కన్వీనర్ వై కరుణ శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి కుక్కల వెంకటేశ్వరరావు, మాజీ మండల ఉపాధ్యక్షులు ఎడ్ల జయశీలరావు, బీసీ సెల్ నాయకులు బట్టు మల్లికార్జునరావు, జంగం సాంసన్ ఉన్నారు.

## ఆత్మీయ సమావేశంలో హనిమిరెడ్డి

**ప్రజాశక్తి - అద్దంకి**

సింగరకొండ రోడ్డులోని కూకట్ల కన్వెన్షన్ హాలులో నాన్ రెసిడెన్స్ ఆఫ్ అద్దంకి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. వైసిపీ ఇంఛార్జి పానెం హనిమిరెడ్డి, వైసిపి నియోజకవర్గ పరిశీలకులు మారం వెంకారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, వైసిపి పట్టణ అధ్యక్షుడు, మండల కన్వీనర్లు, ఎఎంసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**బల్లికురవ రూరల్ :** సంక్రాంతి పండుగ నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలకు వైసిపి కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులకు వైసిపి ఇన్‌ఛార్జి పానెం హనీమరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సంస్కృతీ, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగ వేళ తెలుగు లోగిళ్లు అలనాటి అనుభూతులకు వేదికలుగా మారతాయని, గ్రామాల్లో నెలకొనే సందడి అనిర్వచనీయమైనదని, ధాన్య సిరులు, సిరి సంపదలతో రైతులు జరుపుకునే పండుగ సంక్రాంతి అని అన్నారు.

## 'ఫిల్టర్ బెడ్' ఏర్పాటు

**ప్రజాశక్తి - పర్చూరు**

మండలంలోని నాగులపాలెంలో నడుస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్‌కు రోటరీ కమ్యూనిటీ క్రాప్స్ చే గ్రామస్తుల సహకారంతో రూ.7.20లక్షల ఖర్చుతో నిర్మించిన ఫిల్టర్ బెడ్ సొంపును సర్పంచ్ దాసి సుధారాణి చేతుల మీదుగా రోటరీ క్లబ్‌కు అందించారు. ఆర్‌సిసి అధ్యక్షులు పోటు రాఘవయ్య మాట్లాడుతూ గ్రామస్తులకు, దాతలకు దన్యవాదంలు తెలిపారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ నాగులపాలెంలో మరిన్ని సేవలు అందిస్తామని తెలిపారు. డైరెక్టర్ తెళ్ల రమేష్ చంద్ర మాట్లాడుతూ మంచినీటికి అవసరమైన వనరులు, నిధులకు తోడ్పాటు అందించాలని గ్రామస్తులను, రోటరీ క్లబ్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్సీసీ కార్యదర్శి అడ్డగడ్డ చిన్న నాగేశ్వరరావు, కోశాధికారి కొల్లా శ్రీనివాసరావు, రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి పాల్గొన్నారు.

## పరిచయ వేదిక విజయవంతం

**ప్రజాశక్తి - బాపట్ల**

టిడిపి బాపట్ల పార్లమెంటు అభ్యర్థిత్వం ఆశిస్తూ రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ళ ప్రసాదరావు నిర్వహించిన ప్రజా పరిచయ వేదికకు విచ్చేసి విజయవంతం చేసిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అభిమానులతో కలిసి రాదే ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అధినేత రాధేయ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవంతం చేసిన టిడిపి, జనసేన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## కందిపప్పు త్వరగా పంపిణీ చేయాలి

**ప్రజాశక్తి - చెరుకుపల్లి**

మండలంలో కందిపప్పు పంపిణీ సక్రమంగా, వేగవంతంగా పంపిణీ చేయాలని డిఎస్ఓ విలియమ్స్ ఆదేశించారు. సంక్రాంతి పండుగకు కందిపప్పు ఆలస్యంగా రావడంతో బియ్యం పంపిణీ పూర్తయినప్పటికీ కందిపప్పు సక్రమంగా పంపిణీ జరగలేదని అన్నారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి ఓంకార్ పాల్గొన్నారు.

# బెదిరించటం దుర్మార్గం

- భోగి మంటల్లో 'ఎస్మా' జీవోలు
- అంగన్‌వాడీల నిరసన
- 34వ రోజుకి నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్
న్యాయమైన డిమాండ్స్ కోసం 34 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని, వేతనాలు పెంచేది లేదంటూ సమ్మె విరమించి విధుల్లో చేరకుంటే కొత్తవారిని తీసుకుంటామంటూ బెదిరించటం దుర్మార్గమని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. వేతనాలు పెంపు, గ్రాట్యుటీ అమలుపై పోరాడుతున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కర్కశంగా ఎస్మా విధించి సంజాయిషీ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఎస్మా జీవోలు, సంజాయిషీ నోటీసులను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాలం సుబ్బారావు, యం.రమేష్, జిల్లా నాయకులు జివి కొండారెడ్డి, టి.మహేష్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కంకణాల ఆంజనేయులు, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, కెవిపియస్ జిల్లాకార్యదర్శి బి.రఘురామ్, స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.అయ్యపురెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి యం.రమేష్ పాల్గొన్నారు.

**9వ రోజుకి రిలే నిరాహార దీక్షలు**

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టి నిరవధిక రిలే దీక్షలు 9వ రోజుకి చేరుకున్నాయి. ఈ దీక్షలలో బేస్తవారి పేట ప్రాజెక్టు నుంచి అంగన్‌వాడీలు కూర్చున్నారు. దీక్షలకు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ అధ్యక్షత వహించారు. దీక్షలను ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అయ్యపురెడ్డి ప్రారంభించి.. మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, కెవిపిఎస్ రాష్ట్రనాయకులు ఎ.రాఘవులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కొండారెడ్డి పాల్గొన్నారు.

# ఒంగోలును మరింత అభివృద్ధి చేస్తా

- అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తాం
- ప్రొఫెషనల్స్ మీట్‌లో దామచర్ల జనార్దనరావు వెల్లడి


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దామచర్ల, తేజస్విని

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్
తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలో ఇచ్చిన ఐదు హామీలను నెరవేర్చి ఒంగోలు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు తెలిపారు. స్థానిక పాటిబండ్ల గోపాల స్వామి ఫంక్షన్ హాలులో ఒంగోలు నియోజకవర్గంలోని వివిధ రంగాల నిపుణులతో సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ఐటి ప్రొఫెషనల్ తేజస్విని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు నిపుణులు ఒంగోలు నియోజకవర్గం అభివృద్ధి జరగలేదని, రహదారులు, ట్రిపుల్ ఐటి నిర్మాణం, పోతురాజు కాల్వ నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, టిడ్కో ఇళ్ళు నిర్మాణం ఆగిపోయిందని, టిడిపి అధికారంలోకి వస్తే ఏం చేస్తారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్దనరావు మాట్లాడుతూ టిడిపి హయాంలో ఒంగోలు నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని, రహదారులు నిర్మాణం, 10 బ్రిడ్జిలను నిర్మించామన్నారు. మిగిలిపోయిన ఒక బ్రిడ్జిని అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే 16 వేల మందికి ఇళ్ళు పూర్తి చేసి అందజేస్తామని హామీ ఇచ్చారు. ట్రిపుల్ ఐటికి శాశ్వత భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఒంగోలు నగరంలో కబ్జాకు గురవుతున్న ఇళ్ళ స్థలాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి అసలైన హక్కుదారులకు అప్పగిస్తామన్నారు. ఒంగోలు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి ప్రజలకు మురుగునీటి కష్టాలు లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాల నిపుణులు, టిడిపి నాయకులు కామేపల్లి శ్రీనివాసరావు, పిల్లుట్ల సుధాకర్‌రావు, చుండి శ్యామ్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.
- ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక జీవోల ప్రతులను టిడిపి ఆధ్వర్యంలో దామచర్ల జనార్దన్ భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు.


జీవో ప్రతులను భోగి మంటల్లో వేస్తున్న దామచర్ల

## • 'పది' మోడల్ టెస్ట్ పేపర్లు అందజేత



ముండ్లమూరు మండలంలోని వేంపాడు గ్రామంలో వేంపాడు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు 2024 మోడల్ టెస్ట్ పేపర్లను ఉచితంగా ముండ్లమూరు గ్రామ సర్పంచ్ వద్దిపోగు ఆదిలక్ష్మి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ఆవులూరి ఆంజనేయులు, జక్రయ్య, ఎంఎల్‌వి.ప్రసాదరావు, వెంకటయ్య, హనుమంతరావు, సత్యం పాల్గొన్నారు.
- ప్రజాశక్తి, ముండ్లమూరు

# క్వారీల ద్వారా గణనీయమైన ఆదాయం

- అక్రమ గ్రానైట్ తరలింపును నిరోధిస్తున్నాం.. - గనులు మరియు భూగర్భ శాఖ జిల్లా అధికారి రాజేష్


ముఖాముఖి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా
జిల్లాలో గ్రానైట్ క్వారీలు, వాటి అనుబంధ పరిశ్రమల నుంచి వచ్చే సీనరేజ్ ద్వారా గణనీయమైన రీతిలో ఆదాయం సమకూరుతుందని గనులు మరియు భూగర్భ శాఖ జిల్లా అధికారి రాజేష్ తెలిపారు. నూతనంగా బాపట్ల జిల్లా ఏర్పడిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలో తమ శాఖ కార్యాలయం ఏర్పాటులో కొంత జాప్యం నెలకొన్నప్పటికి సీనరేజ్ వసూళ్లతో పాటు, అక్రమ గ్రానైట్, ఇసుక తరలింపులను నిరోధిస్తూ కోట్ల రూపాయల మేర జరిమానాలు విధించినట్లు చెప్పారు. జిల్లాలో గనులు మరియు భూగర్భ శాఖ పని తీరుపై జిల్లా అధికారి రాజేష్‌తో 'ప్రజాశక్తి' ముఖాముఖి..

**రూ.100 కోట్ల వరకు ఆదాయం**

జిల్లాలోని బల్లికురవ, సంతమాగులూరు, గురిజేపల్లి ప్రాంతాల్లో 170 క్వారీల వరకు ఉన్నాయి. ప్రస్తుతం 500 హెక్టార్లలో విస్తరించి ఉన్న 137 క్వారీల్లో గ్రానైట్ వెలికితీత జరుగుతుంది. ఈ క్వారీల్లో స్టీల్ గ్రే, బ్లాక్ పెరల్ గ్రానైట్ లభిస్తుంది. ఈ గ్రానైట్ క్వారీల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో సీనరేజ్ టార్గెట్ రూ.90 కోట్లుగా ఉంది. ఇప్పటివరకు రూ.69 కోట్లు సీనరేజ్ ద్వారా ఆదాయం వచ్చింది. మార్చి నెలాఖరు నాటికి నిర్ణయించిన టార్గెట్‌ను మించి మరో రూ.15 కోట్ల వరకు సీనరేజ్ రావచ్చని అంచనా.

**రూ.10.69 కోట్ల జరిమానాలు**

జిల్లాలో సముద్రతీర ప్రాంతాలు అయిన గవినివారిపాలెం, కావూరి వారిపాలెం, రామాపురం తదితర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న వారిపై 10 కేసులు నమోదు చేసి.. రూ.8 కోట్ల 90 లక్షల జరిమానా విధించడం జరిగింది. ఇప్పటివరకు 199 కేసులు నమోదు చేసి వారి నుంచి కోటి 79 లక్షల రూపాయల వరకు జరిమానా విధించాం..

**స్లాబ్ విధానంలోకి పాలిషింగ్ యూనిట్లు**

రాష్ట్రప్రభుత్వం పాలిషింగ్ యూనిట్ల యజమానులకు మేలు చేసేందు కోసం స్లాబ్ విధానాన్ని తెచ్చింది. గతంలో క్యూబిక్ మీటర్ల చొప్పున చెల్లింపులు ఉండేవి. ఇప్పుడు సదరు యూనిట్‌లో వాడే బ్లేడ్‌లను బట్టి చెల్లింపులు తెచ్చారు. ఆ పైన క్యూబిక్ మీటర్‌కు రూ.60 చొప్పున యజమానులు చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో 540 వరకు గ్రానైట్ ఆధారిత పరిశ్రమలు, గ్రానైట్ కటింగ్ మరియు పాలిషింగ్ యూనిట్లు ఉన్నాయి. ఇందులో 350 వరకు స్లాబ్ సిస్టమ్‌లో కొచ్చాయి. మిగతా వాటిని కూడా త్వరలోనే స్లాబ్ విధానంలోకి తెస్తారు. జిల్లాలో కటింగ్ పాలిషింగ్ యూనిట్లు మార్టూరు, బల్లికురవ, వేమవరం, సంతమాగులూరు, గురిజేపల్లి ప్రాంతాల్లో వున్నాయి. చీరాలలో సిలికా సాండ్ 4 మైనింగ్ లీజులు ఉన్నాయి. జిల్లా పరిధిలో ఉన్న కష్టానది గర్భం నుంచి గాజుల్లంక, జువ్వలపాలెంల వద్ద ఇసుక లీజులు ఇచ్చారు. అద్దంకి మండలం ధర్మవరం, మార్టూరు మండలం నాగరాజుపల్లిలో తొమ్మిది కంకర యూనిట్లు ఉన్నాయి.

**స్థానిక సంస్థలకు ఖనిజాభివృద్ధి నిధులు**

జిల్లాలో ఖనిజ పరిశ్రమ ద్వారా వస్తున్న ఆదాయాన్ని జిల్లాలో పలు అభివృద్ధి పనుల కోసం రాష్ట్రప్రభుత్వం కేటాయించడం జరుగుతుంది. వచ్చిన ఆదాయాన్ని జిల్లా పరిషత్ గ్రాంట్ కింద 25 శాతం,మండలాలకు 50 శాతం కేటాయిస్తారు. మరో 25 శాతాన్ని గ్రానైట్ పరిశ్రమలు ఉన్న పంచాయితీలకు కేటాయించడం జరుగుతుంది.

## భోగి మంటల్లో జీవో ప్రతులు దహనం


జీవో ప్రతులను దహనం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి-చీమకుర్తి
ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో భూ యాజమాన్య హక్కుల చట్టం జీవో ప్రతులను భోగిమంటల్లో ఆదివారం దహనం చేశారు. మండలంలోని కె.వి పాలెంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొల్లూరు వెంకటేశ్వర్లు నెల్లూరు కష్టయ్య పమిడి నరసింహారావు మాదాల నారాయణ, గోరంట్ల ప్రసాదు, సోమినేని ప్రసాద్, పులి ఓబుల్‌రెడ్డి, పుట్ట శీను, బెజవాడ శ్రీనివాసరావు, అక్కయ్య, మాదాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సంక్రాంతి ముగ్గుల పోటీలు


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్
సంక్రాంతి పండుగ సందర్భంగా 35వ వార్డు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఉమా మహేశ్వర జూనియర్ కళాశాల వద్ద ముగ్గులు, ఆటల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ముగింపు సభలో ముఖ్యఅతిథిగా ఉమామహేశ్వర కాలేజీ అధినేత మల్లేశ్వరరావు, అతిథులుగా డాక్టర్ జోష్న విజయలక్ష్మి పాల్గొన్నారు ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని ఉమామహేశ్వర జూనియర్ కళాశాల అధినేత మల్లేష్‌రావు అందజేశారు. కార్యక్రమంలో అక్కినేని కళాపరిషత్ అధ్యక్షులు కష్టయ్య, కమిటీ సభ్యులు దామా శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, హరిబాబు, బలదేవ్ పాల్గొన్నారు.

## ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించండి


భోగి మంటల్లో జీవో ప్రతులు వేస్తున్న నేతలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్
ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలు యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఆదివారం ప్రభుత్వం ఇచ్చిన జీవో కాపీలను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు , సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, జిల్లా కార్యదర్శులు బాలరాజు, వెంకట్రావు, నారాయణ, యుటిఎఫ్ బాధ్యులు పాల్గొన్నారు.